http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శనివారం 16 మే 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad



## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828




## ఐదు దేశాల పర్యటనకు ప్రధాని మోదీ

- ఇంధన భద్రత, వ్యూహాత్మక సంబంధాలపై చర్చలు
- ఇంధన భద్రత, వ్యూహాత్మక సంబంధాలు పటిష్ఠం చేసుకునేందుకు కృషి
- ఢిల్లీ నుంచి అబుదాబికి శుక్రవారం బయల్దేరిన ప్రధాని
- యూఏఈ పర్యటన తర్వాత మోదీ మే 15-17 తేదీలలో నెదర్లాండ్స్‌లో పర్యటిస్తారు.
- ఈ పర్యటనలో సెమీ కండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, ఆవిష్కరణలు, రక్షణ రంగం, నీటి నిర్వహణ వంటి రంగాలపై ప్రధాని మోదీ దృష్టి సారించే అవకాశం

## పంపిణీకి ముహూర్తం కుదిరింది



- సమస్యల గురించి కూడా పట్టించుకోండి
- గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం
- ఎట్టకేలకు లబ్ధిదారుల చేతుల్లోకి తాళాలు
- మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయాలని కోరుతున్న లబ్ధిదారులు
- నల్గొండలో డబుల్ బెడ్ రూం ఇళ్లు

3

## 2034 తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్తా



- కాంగ్రెస్‌ను కేంద్రంలో అధికారంలోకి తేవడమే లక్ష్యం
- గాంధీ కుటుంబానికి దేశంపై విశ్వాసం ఉంది
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ దగ్గర తనకు చాలా చొరవ ఉంది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యం
- జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటా
- దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యం

హైదరాబాద్

గాంధీ కుటుంబానికి దేశంపై విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ దగ్గర తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని.. కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్టం చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి - మిగతా3లో



## 'కుల వ్యవస్థను నిర్మూలించాలన్నదే నా వ్యాఖ్యల ఉద్దేశం

- ఉదయనిధి స్టాలిన్ క్లారిటీ
- సనాతన ధర్మంపై నా వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు
- దేవుడిపై ఉండే నమ్మకానికి తాము వ్యతిరేకం కాదు

## మోదీ సర్కార్ చేసిన తప్పిదానికి ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు

- పెట్రో ధరల పెంపుపై రాహుల్ గాంధీ ఫైర్
- ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి షాక్ ఇచ్చారు
- మిగిలిన వస్తువుల వాయిదాల పద్ధతిలో జరుగుతాయ్ : రాహుల్ గాంధీ ఎద్దేవా





## ప్రజలకు ప్రపంచస్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో టిమ్స్ ఏర్పాటు చేశాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు పోటీగా పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం టిమ్స్‌ను తీసుకువచ్చింది
- వరంగల్‌లో 2000 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాం
- నిమ్స్ ఆసుపత్రిని కూడా భారీ స్థాయిలో విస్తరణ పనులు మొదలుపెట్టాం

3లో

## గులాబీ జోరు అందుకుంటుందా?

- కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ లో తాజాగా బీఆర్ఎస్ సీనియర్లతో అతి ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించారు
- ఎన్నడూ లేని విధంగా ఏకంగా ఆరు గంటల సేపు ఈ మీటింగ్ సాగింది
- ఏకంగా బీఆర్ఎస్ ని గ్రౌండ్ నుంచి టాప్ లెవెల్ వరకూ కొత్త రూపుతో షేపుతో తీర్చిదిద్దాలని కేసీఆర్ పార్టీ వర్గాలకు దిశా నిర్దేశం చేశారని అంటున్నారు
- బీఆర్ఎస్ విషయంలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టాలని కూడా డిసైడ్ అయినట్లుగా తెలుస్తోంది.




హైదరాబాద్

తెలంగాణాకు మోడీ వచ్చి సగం రోజు అక్కడే ఉండి చేసిన రాజకీయ కలకలం అంతా ఇంతా కాదు, సీఎం రేవంత్ రెడ్డిని తమతో కలవమని బంపర్ ఆఫర్ ఇచ్చారు. దాంతో ఎవరికి తోచిన విధంగా వారు దీని మీద విశ్లేషించి రచ్చ చేశారు. ఇక రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్డీయే బలోపేతం మీద మోడీ మిత్రులతో చర్చించారు అన్న వార్తలతో అటు ఆంధ్రాలో వైసీపీ ఇటు తెలంగాణాలో బీఆర్ఎస్ కూడా ఉలిక్కిపడి ఫ్యూచర్ కోర్స్ ఆఫ్ యాక్షన్ లోకి దిగిపోతున్నాయి. కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ లో తాజాగా బీఆర్ఎస్ సీనియర్లతో అతి ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నడూ లేని విధంగా ఏకంగా ఆరు గంటల సేపు ఈ మీటింగ్ సాగింది అని అంటున్నారు. ఈ మీటింగ్ వేరీ సీరియస్ గానే సాగింది అని అంటున్నారు. ఏకంగా బీఆర్ఎస్ ని గ్రౌండ్ నుంచి టాప్ లెవెల్ వరకూ కొత్త - మిగతా3లో




## నీట్ పేపర్ లీక్ కేసు ప్రధాన నిందితుడు అరెస్ట్

- నీట్ పేపర్ లీక్ కేసులో సూత్రధారి గుర్తింపు
- పి.వి.కులకర్ణిని కీలక సూత్రధారిగా సీబీఐ గుర్తింపు
- గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నాపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా పి.వి.కులకర్ణి



## సోమ, శుక్రవారాల్లో ఆన్‌లైన్ విచారణలు

- సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు
- ఇంధన పొదుపు చర్యలు చేపట్టిన సుప్రీంకోర్టు
- ఇకపై వారంలో రెండు రోజులు ఆన్‌లైన్‌లోనే కేసుల విచారణ
- విచారణ లింక్‌లను సకాలంలో పిటిషనర్లకు పంపించాలని ఆదేశాలు జారీ

## ఐరాసలో సంస్కరణలు చేపట్టాలి



- భద్రతా మండలిని విస్తరించాలి: భారత్
- ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు ఎప్పుడో జరగాల్సింది
- భద్రతా మండలిని కూడా విస్తరించాలి
- బ్రిక్స్ సదస్సులో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు

# ఐరాసలో సంస్కరణలు చేపట్టాలి

ఐక్యరాజ్యసమితితో సహా ప్రపంచ పాలనా సంస్థల్లో అత్యవసర సంస్కరణలు చేపట్టాలని, బహుళపక్ష సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. దిల్లీలో శుక్రవారం జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో 'ప్రపంచ పాలన, బహుళపక్ష వ్యవస్థ సంస్కరణలు' అనే అంశంపై సెషన్ నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన జైశంకర్, ఐక్యరాజ్యసమితి మరింత ప్రభా వవంతంగా పనిచేయాలంటే, భద్రతా మండలిని విస్తరిం చడంతో పాటు, సంస్కరణలు చేపట్టడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ స్థాయి సంస్థలు కాలం చెల్లిన నిబంధనలతో పనిచేస్తున్నాయని, అందువల్ల అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య వ్యవస్థల పునర్నిర్మాణాన్ని భారత్ కోరుకుం టోందని ఆయన అన్నారు. ఈ సమావేశం తర్వాత జైశంకర్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. అందులో పరస్పరం అనుసంధానమైన నేటి బహుళ-ధృవ ప్రపంచంలో 'నమ్మకమైన, సంస్కరణలతో కూడిన బహుళపక్ష విధానం' అత్యవసరం అని, బ్రిక్స్ సమావేశంలో దీనిపైనే ప్రధానంగా చర్చించామని అన్నారు. "ప్రస్తుత కాలం ఇస్తున్న సందేశం చాలా స్పష్టం. సహకారం, చర్చలు జరపడం చాలా అవసరం. ఇప్పటికే సంస్కరణలు చేపట్టడం చాలా ఆలస్యమైంది. అందువల్ల ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత, తాత్కాలిక సభ్యదేశాల సంఖ్య పెంచాలి. లేకుంటే ఐరాస ప్రభావం, విశ్వసనీయత చాలా పరిమితంగా ఉండిపోయే అవకాశం ఉంది." ఇక ఐరాస సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు రాత పూర్వక చర్చలు (టెక్స్ట్ బేస్డ్ నెగోసియేషన్స్) తక్షణమే ప్రారంభం కావాలని జైశంకర్ పేర్కొన్నారు. అలాగే బహుళపక్ష అభివృద్ధి బ్యాంకులను మరింత బాధ్యతాయుతంగా, మరింత బలంగా మార్చాల న్నారు. ఇందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నిర్మాణంలో అత్యవసర మార్పులు అవసరమని పేర్కొన్నారు. అలాగే వాతావరణ నిధులు (క్లైమేట్ ఫైనాన్స్), అభివృద్ధి నిధుల లభ్యతను పెంచాలని జైశంకర్ కోరారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) కేంద్రంగా పనిచేసే 'నిబంధనలకు కట్టుబ డి, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, అందరినీ కలుపుకు పోయే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ' ఉండాలని అన్నారు.



### అరాగ్చీతో చర్చలు

బ్రిక్స్ సమావేశాల మధ్యలోనే ఇరాన్? విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్? అరాగ్చీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అరాగ్చీ మాట్లాడుతూ, భారత్? అధ్యక్షతన బ్రిక్స్ సభ్య దేశాల మధ్య మరింత సమన్వయం, విజయాలు సాధించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికాతో జరిగిన యుద్ధం, కాల్పుల విరమణ పరిస్థితులు, వివాదాన్ని ముగించేందుకు జరుగుతున్న చర్చల వివరాలను ఆయన జైశంకర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు హర్మూజ్ జలసంధిలోని తాజా పరిణామాలు, సముద్ర భద్రత, ప్రాంతీయ స్థిరత్వంపై తమతమ అభిప్రాయాలు పంచుకున్నారు.

### ఇరాన్‌తో స్నేహం

ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ వివాదాలకు దౌత్యపరమైన పరిష్కారాలు కనుగొనాలని, వాటికే భారత్ మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. భారత్-ఇరాన్ మధ్య ఎప్పుడూ స్నేహపూర్వక సంబంధాలు ఉంటాయని పేర్కొన్నారు.

### ద్వంద్వ విధానాలపై ఇరాన్ ఆగ్రహం

బ్రిక్స్ సమావేశం రెండో రోజున ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ, ఇరాన్‌లోని పౌరులపై, మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. పౌరులపై దాడులను అంతర్జాతీయ సమాజం ఖండించాలని, ద్వంద్వ విధానాలను వీడాలని ఆయన కోరారు. 'మినాబ్?లో ఒక చిన్నారి ప్రాణం కూడా, ప్రపంచంలో మరెక్కడైనా ఉండే చిన్నారి ప్రాణంతో సమానమని నిరూపించాలి' అని అన్నారు. ఐరాస భద్రతా మండలి సంస్కరణ అనేది ఒక ఐచ్ఛికం కాదు, అది ఐరాస మనుగడకే అత్యంత అవసరమని అరాగ్చీ స్పష్టం చేశారు. "ప్రపంచంలోని అన్ని ఖండాలు, ప్రాంతాలకు నిజమైన ప్రాతినిధ్యం వహించే కౌన్సిల్ మాకు కావాలి. అధికారం కేవలం కొద్ది మంది దుర్వినియోగ, దురాక్రమణ శక్తుల ప్రయోజనాల కోసమే కాకుండా, బాధ్యతాయుతంగా, సమానంగా పంపిణీ చేయబడే మండలి మాకు కావాలి" అని ఆయన అన్నారు. ఈ నిజమైన బహుళపక్ష విధానానికి బ్రిక్స్? కూటమి ఒక వెన్నెముకగా మారగల సామర్థ్యాన్ని కలిగి ఉందని ఇరాన్ విదేశాంగ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# సోమ, శుక్రవారాల్లో ఆన్‌లైన్ విచారణలు

సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు చేపట్టింది. ఇక నుంచి వారంలో రెండు రోజుల పాటు ఆన్‌లైన్‌లోనే కేసుల విచారణ చేపట్టాలని నిర్ణయించింది. సోమ, శుక్రవారాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసులను విచారిస్తామని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేశారు. ఆన్‌లైన్ విచారణ కోసం లింక్‌లను సకాలంలో పిటిషనర్లకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణ సమయంలో సాంకేతిక అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్దేశించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు చేపట్టాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు చేపట్టింది. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు సీజేఐ సహా ఇతర న్యాయమూర్తులు కార్ పూలింగ్ విధానాన్ని అనుసరించనున్నారు. రిజిస్ట్రీలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల్లో 50 శాతం మందికి వారంలో రెండ్రోజుల పాటు వర్క్ ఫ్రం హోం విధానాన్ని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఇందుకోసం వీక్లీ రోస్టర్‌ను తయారు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఇళ్ల నుంచి పనిచేసే వారు ఎల్లప్పుడూ ఫోన్ ద్వారా అందుబాటులో ఉండాలని, అవసరమైతే వెంటనే కార్యాలయానికి రావాల్సి ఉంటుందని తెలిపింది. సంబంధిత అధికారులు తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసేలా నిర్ధారించుకోవాలని రిజిస్ట్రీకి సూచించింది. అయితే, వర్క్? ఫ్రం హోమ్ సమర్థవంతంగా లేదని సంబంధిత రిజిస్ట్రార్ అభిప్రాయపడితే, ఆయా శాఖ లేదా విభాగానికి అటువంటి



ఏర్పాట్లను పరిమితం చేయవచ్చు లేదా సవరించవచ్చునని సర్క్యులర్?లో పేర్కొంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు సుప్రీంకోర్టు ఈ చర్యలు చేపట్టింది.

### ఇంధన సంక్షోభంపై మోదీ సూచనలు

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం తలెత్తింది. ఈ క్రమంలో భవిష్యత్?లో దేశంలో ఇంధన కొరత తలెత్తకుండా ప్రధాని మోదీ పలు కీలక సూచనలు చేశారు. ఇంధనం పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్?కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే, ఏడాది పాటు బంగారం కొనవద్దని చెప్పారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎప్పుడైనా పెరిగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. చిన్న చిన్న చర్యలతో దేశానికి మేలు చేయవచ్చునని అన్నారు.

### ప్రధాని పిలుపునకు విశేష స్పందన

అయితే, ప్రధాని మోదీ పిలుపునకు విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే ప్రధాని మోదీ సహా పలు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు తమ కాన్వాయ్‌లలోని వాహనాల సంఖ్యను గననీయంగా తగ్గించుకున్నారు. తాజాగా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రజా రవాణాకు ప్రాధాన్యమిచ్చి, కాన్వాయ్‌ని వాడకుండా రైలులో ప్రయాణించి కురుక్షేత్రకు వెళ్లారు. అనంతరం రైల్వే స్టేషన్ నుంచి సైకిల్ తొక్కుతూ గురుకుల్ చేరుకున్నారు. ఆయన భద్రతా సిబ్బంది సైతం సైకిల్‌పైనే గవర్నర్‌ను అనుసరిస్తూ తమ విధులను నిర్వర్తించారు.

### దిల్లీలో వర్క్ ఫ్రం హోమ్

మరోవైపు, దిల్లీ ప్రభుత్వం కూడా ఇప్పటికే అనేక పొదుపు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ ప్రకటించింది. ప్రతి సోమవారం మెట్రోలో కార్యాలయాలకు రావాలని ఉద్యోగులకు సూచించింది. అధికారుల వాహనాలకు ఇచ్చే పెట్రోల్, డీజిల్‌లో 20 శాతం కోత విధించింది. సీఎం, మంత్రుల కాన్వాయ్‌ని సగానికిపైగా తగ్గించింది. మరోవైపు, ఇంధన ధరల పెంపుపై విపక్షాలు విరుచుకుపడ్డాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్?పై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశాయి. అయితే, ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయని ముందుగానే ఊహించామని తృణమూల్ కాంగ్రెస్ దుయ్యబట్టింది.

# మోదీ సర్కార్ చేసిన తప్పిదానికి ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు

పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం మోదీ సర్కార్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం చేసిన తప్పునకు సామాన్య ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారని విమర్శించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగిపోయాయి. దీనితో ప్రభుత్వ రంగ ఇంధన సంస్థలు ఆ భారంలో కొంత భాగాన్ని వినియోగదారులపైకి నెట్టాయి. దీనితో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.3 చొప్పున పెరిగాయి. గత నాలుగేళ్లు లేదా అంత కంటే ఎక్కువ కాలంలో ఇంధన ధరలు పెరగడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. అయితే దీనిపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్? గాంధీ ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "మోదీ ప్రభుత్వం తప్పు చేసింది. ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలపై రూ.3 పెంచి షాక్ ఇచ్చారు. మిగిలిన వసూళ్లు వాయిదాల పద్ధతిలో జరుగుతాయి."

### సీఎన్‌జీ ధరలు కూడా పెరిగాయ్

మరోవైపు దిల్లీ, ముంబయి లాంటి నగరాల్లో సీఎన్?జీ ధరలు కూడా కిలోకు రూ.2 చొప్పున పెంచారు. పరిశ్రమ వర్గాల ప్రకారం, దిల్లీలో పెట్రోల్ ధర లీటర్?కు రూ.94.77 నుంచి రూ.97.77కు పెరిగింది. లీటర్? డీజిల్ ధర రూ.87.67 నుంచి ఇప్పుడు రూ.90.67కు చేరింది. అయితే రాష్ట్రాలు విధించే 'విలువ ఆధారిత పన్ను'లో ఉన్న వ్యత్యాసాల కారణంగా ఈ ధరలు ఆయా రాష్ట్రాలను బట్టి మారుతుంటాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేశాయి. తర్వాత ఇరాన్ కూడా ప్రతిదాడులకు దిగి, హర్మూజ్ జలసంధిని దిగ్బంధనం చేసింది. దీనితో అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత




కీలకమైన హర్మూజ్ గుండా చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ఫలితంగా ప్రపంచ మార్కెట్లో ముడిచమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి.

అయితే, పశ్చిమాసియా ఉద్రిక్తతలు వల్ల ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు పెరిగినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం దేశీయ ఇంధన సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచకుండా చూసింది. అయితే నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందువల్లనే కేంద్రం ఇంధన ధరలు పెంచలేదని, దీని వెనుక రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయని, అప్పట్లోనే ప్రతిపక్షాలు ఆరోపించాయి. దీని తర్వాత బంగాల్, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగురువేసి, ప్రభుత్వాలను ఏర్పాటుచేసింది. బంగాల్‌లో అయితే మొదటిసారి కాషాయపార్టీ తన జెండాను పాతగలిగింది. అయితే విపక్షాలు అన్నట్లుగానే, అసెంబ్లీ ఎన్నికలు అయిన తర్వాత మోదీ సర్కార్, ఇంధన ధరలు పెంపు నిర్ణయం తీసుకుంది. దీనితో 2022 మే తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు అత్యంత గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి.

### రూ.3 పెంపు సరిపోతుందా?

తాజాగా పెంచిన ధరలు చాలా మంది భారతీయులకు భారంగా మారాయన్నది వాస్తవం. అయితే లీటర్? పెట్రోల్, డీజిల్?పై రూ.3 పెంపు అనేది చాలా ఎక్కువగా అనిపిస్తున్నప్పటికీ, వాస్తవానికి ఇది ఆయిల్? మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) భరిస్తున్న నష్టాన్ని తీర్చలేదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే, పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు ఓఎంసీలు మంచి లాభాల్లో ఉన్నాయి. కానీ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ నష్టాలను భరిస్తూ వస్తోంది. ఈ యుద్ధం ఇంకొన్నాళ్లు కొనసాగితే, ప్రతి కంపెనీ తీవ్రమైన నష్టాలకు, ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది. నిపుణుల ప్రకారం, యుద్ధానికి ముందు బ్యారెల్ ముడిచమురు ధర సగటున 69 డాలర్లుగా ఉండగా, ఈ ఏప్రిల్?లో సగటున 114.48 డాలర్లకు, మే నెలలో ఇప్పటి వరకు సగటున 105.87 డాలర్లకు చేరుకుంది. దీని వల్ల ఓఎంసీలు భారీగా నష్టపోతున్నాయి. ఈ భారీ నష్టాలను పూడ్చుకోవాలంటే, లీటర్? పెట్రోల్ ధర రూ.28లు, లీటర్ డీజిల్ ధర రూ.33 వరకు పెంచితేకాని ఏఎంసీలకు బెనిఫిట్ ఉండదు. అయితే ప్రస్తుత భారత రాజకీయ వాతావరణంలో, ఇంతటి భారీ స్థాయిలో ఇంధన ధరలు పెంచడం సాధ్యం కాదని నిపుణులు అంటున్నారు.

## నీట్ పేపర్ లీక్ కేసు

## ప్రధాన నిందితుడు అరెస్ట్

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఒక ప్రొఫెసర్‌ను పుణెలో కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ) శుక్రవారం అరెస్టు చేసింది. 'మహారాష్ట్రలోని లాతూరు ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్ పీవీ కులకర్ణి రసాయన శాస్త్రంలో నిపుణుడు. ఆయన గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నాపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం పుణెలో నివసిస్తున్నారు. నీట్ ప్రశ్నపత్రాలను చూడడానికి ఆయనకు యాక్సెస్ ఉంది. అయినప్పటికీ ఆయన తన సొంత ఇంటిలోనే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ క్లాసులు నిర్వహించినట్లు సీబీఐ దర్యాప్తులో తెలిసింది' అని సీబీఐ అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై ఓ ఉన్నతాధికారి మాట్లాడుతూ, "ఈ కేసులో మరో నిందితురాలైన మనీషా వాఘ్మారే సాయంతో ప్రొఫెసర్ కులకర్ణి 2026 ఏప్రిల్ చివరి వారంలో పెద్ద ఎత్తున విద్యార్థులను సమీకరించి, తన కోచింగ్ సెంటర్‌లో చేర్చుకున్నారు. తరువాత నీట్-యూజీ పరీక్షలో వచ్చే ప్రశ్నలను, వాటి ఆప్షన్లను, సరైన సమాధానాలను స్వయంగా డిక్టేట్ చేశారు. ఆయన చెప్పిన ప్రశ్నలను విద్యార్థులు తమ నోట్‌బుక్స్‌లో చేతిరాతతో రాసుకున్నారు. మే 3వ తేదీన జరిగిన నీట్-యూజీ అసలు పరీక్ష పత్రంతో ఈ నోట్స్ అచ్చుగుద్దినట్లు సరిపోలింది" అని పేర్కొన్నారు. కాగా, మనీషా వాఘ్మారేను సీబీఐ మే 14న అరెస్టు చేసింది.

## ఐదు దేశాల పర్యటనకు ప్రధాని మోదీ

ఐదు దేశాల పర్యటన నిమిత్తం భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం అబుదాబి బయలుదేరారు. మే 15-20 వరకు యూఏఈ, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ దేశాల్లో పర్యటించనున్నారు. ఆయా దేశాలతో వాణిజ్యం, సాంకేతికత, ఇంధనం, ఆవిష్కరణలు, హరిత వృద్ధి వంటి రంగాలలో భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు చర్చలు జరపనున్నారు. అలాగే యూరప్, గల్ఫ్ ప్రాంతాలతో భారత్ సంబంధాలను మరింత పటిష్ఠం చేయనున్నారు. ఆరు రోజుల పాటు ప్రధాని మోదీ విదేశాల్లో పర్యటించనున్నారు.

### యూఏఈతో పర్యటనతో స్టార్ట్

ప్రధాని మోదీ మే 15న యూఏఈ పర్యటనతో తన విదేశీ యాత్రను ప్రారంభిస్తారు. అక్కడ యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌ను కలుస్తారు. నెహ్యాన్‌తో ఇంధన సహకారం, వాణిజ్యం, పెట్టుబడులు, ప్రాంతీయ సమస్యలపై చర్చిస్తారు. యూరప్ పర్యటనకు ముందు మోదీ యూఏఈలో నాలుగు గంటలు యూఏఈలో గడుపుతారు.

### నెదర్లాండ్స్ ప్రధానితో భేటీ

యూఏఈ పర్యటన తర్వాత మోదీ మే 15-17 తేదీలలో నెదర్లాండ్స్‌లో పర్యటిస్తారు. అక్కడ నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో చర్చలు జరపడంతో పాటు, కింగ్ విల్లెం అలెగ్జాండర్, క్వీన్ మాక్సిమాలను కలవనున్నారు. ఈ పర్యటనలో సెమీ కండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, ఆవిష్కరణలు, రక్షణ రంగం, నీటి నిర్వహణ వంటి రంగాలపై ప్రధాని మోదీ దృష్టి సారించే అవకాశం ఉంది. 2017 తర్వాత మోదీ నెదర్లాండ్స్‌లో పర్యటించడం ఇది రెండోసారి.

### స్వీడన్‌లో రెండు రోజులు మకాం

మే 17-18 తేదీలలో ప్రధాని మోదీ స్వీడన్‌లో పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్‌సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఈయూ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌తో కలిసి ఇరు దేశాధినేతలు యూరోపియన్ రౌండ్ టేబుల్ ఫర్ ఇండస్ట్రీలో సంయుక్తంగా ప్రసంగించే అవకాశం ఉంది. అలాగే ఏఐ, వర్ధమాన సాంకేతికతలు వంటి వాటిపై చర్చలు జరిగే అవకాశం ఉంది.

### నార్వే ప్రధానితో ద్వైపాక్షిక చర్చలు

మే 19న నార్వేలోని ఓస్లోలో జరగబోయే మూడో భారత్-నార్డిక్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. అనంతరం నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో డెన్మార్క్, ఫిన్లాండ్, ఐస్‌లాండ్, స్వీడన్ దేశాల నాయకులు కూడా పాల్గొంటారు. మే 19-20 తేదీలలో ఇటలీలో పర్యటించనున్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, ఆ దేశ అధ్యక్షుడు సెర్గియో మట్టారెల్లాలతో మోదీ చర్చలు జరపనున్నారు. స్వచ్ఛ ఇంధనం, రక్షణ, సాంకేతిక రంగాలలో భారత్-ఇటలీ సహకారం పెరుగుతున్న నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యం సంతరించుకుంది.

### మోదీ పర్యటనపై యూఈఏ ఏమందంటే?

అలాగే తమ దేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించడంపై యూఏఈ అంతర్జాతీయ సహకార శాఖ సహాయ మంత్రి రీమ్ అల్ హషీమీ స్పందించారు. వాణిజ్యం, సాంకేతికతలో భారత్, యూఏఈ ద్వైపాక్షిక సంబంధాలు కొత్త శిఖరాలను అధిరోహిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ పర్యటన పట్ల తాము ఎంతో ఉత్సాహంగా ఉన్నామని చెప్పారు. ఇరు దేశాల సుదీర్ఘ భాగస్వామ్యంలో ప్రధాని మోదీ ఒక కీలక వ్యక్తిగా ఉన్నారని కొనియాడారు.

### ఈ టూర్ భారత్‌కు చాలా కీలకం : ఫియో

ప్రధాని ఐదు దేశాల పర్యటనకు ముందు భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) కీలక వ్యాఖ్యలు చేసింది. మోదీ ఈ పర్యటన ఒక కీలకమైన తరుణంలో జరుగుతోందని అభిప్రాయపడింది. ఇది యూరప్, గల్ఫ్ ప్రాంతాలతో దేశ వాణిజ్య, పెట్టుబడి సంబంధాలకు కొత్త ఊపునిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపింది. యూరప్, గల్ఫ్ ప్రాంతాలతో భారతదేశ ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలకు ఈ పర్యటన చాలా ముఖ్యమైనదని పేర్కొంది. ఇంజినీరింగ్, స్వచ్ఛ ఇంధనం, టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, డిజిటల్ ట్రేడ్ వంటి రంగాలలో భారతీయ ఎగుమతిదారులకు ఈ ఉన్నత స్థాయి సమావేశాలు కొత్త అవకాశాలను సృష్టిస్తాయని భావిస్తున్నామని వెల్లడించింది. ఈ మేరకు ఫియో అధ్యక్షుడు ఎస్‌సీ రల్హాన్ వ్యాఖ్యానించారు. "యూఏఈ, ఈయూ దేశాల నాయకులతో ప్రధాని మోదీ జరిపే ఉన్నత స్థాయి సమావేశాలు విశ్వసనీయ ఆర్థిక భాగస్వామిగా, ప్రపంచ వృద్ధికి కీలక చోదకంగా భారత్ పెరుగుతున్న స్థాయిని నొక్కి చెబుతున్నాయి. ఇంజినీరింగ్, స్వచ్ఛ ఇంధనం, టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, డిజిటల్ ట్రేడ్‌తో సహా పలు రంగాలలో భారతీయ ఎగుమతిదారులకు ఈ పర్యటన గణనీయమైన అవకాశాలను సృష్టిస్తుందని భావిస్తున్నాం. భారత్, నార్వే దేశాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక సమన్వయం సుస్థిర, హరిత వృద్ధి దిశగా సాగుతోంది. ఇది భారతీయ వ్యాపారాలు, స్టార్టప్‌లు, సాంకేతిక భాగస్వామ్యాలకు కొత్త ద్వారాలను తెరుస్తుంది. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, భారత్-ఈఎఫ్‌టీఏ వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టీఈపీఏ) ఇటీవలే కుదిరిన నేపథ్యంలో యూరప్‌లో ప్రధాని మోదీ పర్యటించడంతో ఈ టూర్‌కు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. యూఏఈ భారతదేశానికి అత్యంత ముఖ్యమైన వాణిజ్య, పెట్టుబడి భాగస్వాములలో ఒకటి. అలాగే పశ్చిమాసియా, ఆఫ్రికాకు భారతీయ ఎగుమతులకు కీలకమైన ముఖద్వారంగా కొనసాగుతోంది. మోదీ యూఏఈ పర్యటన ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది. యూఏఈలో ఉన్న ప్రవాస భారతీయులు కూడా ఇరుదేశాల మధ్య వ్యాపార సంబంధాలను పెంపొందించడంలో వారధిగా పనిచేస్తున్నారు" అని ఎస్‌సీ రల్హాన్ పేర్కొన్నారు.

## కుల వ్యవస్థను నిర్మూలించాలన్నదే

## నా వ్యాఖ్యల ఉద్దేశం

సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్న వేళ తమిళనాడు అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, నటుడు ఉదయనిధి స్టాలిన్ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని, ప్రజలను అగ్ర, నిమ్న కులాల పేరుతో విభజించే వ్యవస్థను మాత్రమే నిర్మూలించాలన్నది తన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎవరూ ఆలయాలకు వెళ్లొద్దు అని చెప్పడం తన ఉద్దేశం కాదని వివరించారు. ఆలయాలతో పాటు సమాజంలో ప్రతీ ఒక్కరికీ సమాన హక్కులు ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఎవరెన్ని విమర్శలు చేసినా తాను భయపడే వ్యక్తిని కాదని, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతుంటానని ఉదయనిధి స్టాలిన్ చెప్పారు. పెరియార్, అంబేడ్కర్, అన్నా, కళైంగర్ సిద్ధాంతాల గురించి కూడా తాను అసెంబ్లీలో మాట్లాడానని తెలిపారు. దేవుడిపై ఉండే నమ్మకానికి తాము వ్యతిరేకం కాదన్న ఉదయనిధి, అసమానతలను, అణచివేతను మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. కాగా మంగళవారం అసెంబ్లీలో సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని ఉథయనిధి వ్యాఖ్యానించారు. అది మనుషులను కులం పేరుతో విభజిస్తుందని పేర్కొన్నారు.

# పంపిణీకి ముహూర్తం కుదిరింది

నల్గొండ జిల్లాలో రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులకు గృహయోగంపై ఆశలు చిగురిస్తున్నాయి. నిర్మాణాలు పూర్తయినా ఇప్పటివరకు పంపిణీ కాకుండా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అందజేయేందుకు అధికారులు ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నారు. అయితే ఏళ్ల తరబడి వాడుకలో లేకపోవడంతో గృహ సముదాయాల్లో అనేక సమస్యలు బయటపడుతున్నాయి.

**గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం**

నిరుపేదల ఆత్మగౌరవ ప్రతీకగా భావించిన రెండు పడక గదుల ఇళ్ల పంపిణీకి నల్గొండ జిల్లాలో మార్గం సుగమమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో ఈ ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా మౌలిక వసతుల లోపం, గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా పనులు సంవత్సరాలుగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి పేదలకు ఇళ్లు అందజేస్తామని ప్రకటించింది.

**ఇళ్ల పంపిణీకి సిద్ధమౌతున్న అధికారులు**

ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలుగా విభజించారు. ప్రస్తుతం ఇంటి స్థలాలు ఉన్న ఎల్-1 లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తుండగా స్థలాలు, ఇళ్లు లేని ఎల్-2 దరఖాస్తుదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జూన్ 2న జిల్లావ్యాప్తంగా ఇళ్ల పంపిణీకి అధికారులు సిద్ధమవుతున్నారు.

**అస్తవ్యస్తంగా వసతులు**

ఈటీవీ-ఈనాడు బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించగా అనేక సమస్యలు వెలుగుచూశాయి. ఏళ్లుగా పంపిణీ కాకపోవడంతో గృహ సముదాయాలు ఆకతాయిల అడ్డాగా మారాయి. కిటికీల అద్దాలు, విద్యుత్ బోర్డులు, నీటి పైపులు ధ్వంసమయ్యాయి. మద్యం సీసాలు ప్రాంగణాల్లో కనిపిస్తున్నాయి. కొన్ని ఇళ్లలో గబ్బిలాలు చేరగా మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారాయి. నీటి ట్యాంకులు దెబ్బతిన్నాయి. ఇంకా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, మురుగునీటి పైపులు వంటి మౌలిక వసతుల పనులు పూర్తికాలేదు. అమృత్-2 పథకం కింద తాగునీటి కనెక్షన్లు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది.



"నల్లగొండ పట్టణంలో 552 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను 2017లో ప్రారంభించారు. 2026 వస్తున్నప్పటికీ రెండు ప్రభుత్వాలు మారినా లబ్ధిదారులకు అందని ద్రాక్షలాగే మిగిలిపోతున్నాయి. రోజు రోజూ లబ్ధిదారుల్లో ఆందోళన పెరుగుతోంది. ఇప్పటికే దీనిపై పార్టీ తరపున అనేక పోరాటాలు చేశాం. దానికి అనుగుణంగా గతంలో లక్కీ డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకే ఇళ్లను కేటాయిస్తామని ప్రభుత్వం తెలియజేసింది. దానికి ధన్యవాదాలు. కానీ అక్కడ కనీస వసతుల విషయంలో మాత్రం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది. దానికి సంబంధించిన పనులు నత్తనడకగా సాగుతుంది. ఆ ఇళ్లలో కావాల్సిన కరెంట్, నీళ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పిస్తే మిగతావి ఆలస్యంగానైనా చేయొచ్చు"

మొత్తం 8,155 డబుల్ బెడ్‌రూం ఇళ్లు : నల్గొండ జిల్లాలో ఆరు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 8,155 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు. ఇందులో జూన్ 2న మొదటి విడతగా 1,574 ఇళ్లను పంపిణీ చేయనున్నారు. నల్గొండ మండలంలో 552, మిర్యాలగూడలో 560, తిప్పర్తిలో 100, బ్రాహ్మణవెల్లంలో 150, ఔరావాణిలో 80, చిట్యాలలో 132 ఇళ్లు అందజేయనున్నారు. గతంలో లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు మౌలిక వసతుల కొరత కారణంగా ఇళ్లు అప్పగించలేదు. ఈసారి వారికి కూడా తాళాలు అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.

"2164 డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇంకా ఇవ్వాల్సి ఉంది. అందులో 31 కాలనీలు ఉన్నాయి. వాటిలో ఇప్పటికే 19 కాలనీలను అందించాం. ఇంకా 12 కాలనీలు ఇవ్వాల్సి ఉంది. నల్గొండలో 552, మిర్యాలగూడలో 560, తిప్పర్తిలో 100 ఇళ్లను జూన్ 2 అందించటానికి గౌరవ మంత్రిగారు ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి జూన్? 2నే గృహప్రవేశాలు చేయాలని ఆదేశాలిచ్చారు"

**లబ్ధిదారుల ఆశాభావం**

ఈసారైనా ప్రభుత్వం వాయిదా వేయకుండా ఇళ్ల పట్టాలు అందజేస్తే తమ సొంతింటి కల నెరవేరుతుందని లబ్ధిదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన మౌలిక వసతుల పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

# హరీష్ పార్టీకి దూరమౌతున్నారా...

**మెదక్ :** హరీష్ రావు తాను అమెరికా వెళ్తున్నట్లుగా ప్రకటించారు. కొన్నాళ్లు అక్కడే ఉంటానని కూడా సోషల్ మీడియాలో తెలిపారు. ఎన్నాళ్లన్నది చెప్పలేదు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో జరుగుతున్న పరిణామాలతో సహజంగానే హరీష్ రావు అమెరికా పర్యటన బీఆర్ఎస్‌లో అంతర్గతంగా కలకలం రేపుతోంది. గతంలో కవిత కూడా అలా అమెరికా పోయినప్పుడు ఇక్కడ చాలా జరిగాయి. ఆమె వచ్చే సరికి.. ఆమెకు, పార్టీకి మధ్య పూడ్చలేనంత గ్యాప్ వచ్చింది. చివరికి అది సొంత పార్టీ ప్రకటనకు దారి తీసింది. కొద్ది రోజులుగా బీఆర్ఎస్ పార్టీలో కేటీఆర్ వర్గానికి, హరీష్ రావు వర్గానికి మధ్య కోల్డ్ వార్ నడుస్తోందనే వార్తలు వెబ్ మీడియాలో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. పార్టీ పగ్గాల విషయంలో గానీ, భవిష్యత్తు కార్యాచరణలో గానీ హరీష్ రావును పక్కన పెడుతున్నారనే అసంతృప్తి ఆయన అనుచరుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. హరీష్ రావు రాజకీయాలు భిన్నంగా ఉంటాయి. బండి సంజయ్ కుమారుడి కేసును బీఆర్ఎస్ సీరియస్ గా రాజకీయం చేస్తే హరీష్ రావు మాత్రం ఏమీ మాట్లాడలేదు. సరిగ్గా ఇటువంటి కీలక సమయంలో హరీష్ రావు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండి అమెరికా వెళ్లడం, ఆయన మౌన ముద్ర వేయబోతున్నారా? లేక పార్టీ వ్యవహారాల నుంచి కొద్దిరోజులు విరామం కోరుకుంటున్నారా? అన్న సందేహాలు పార్టీ క్యాడర్‌కు వస్తున్నాయి.హరీష్ రావు పార్టీలో అంత కంఫర్టబుల్ గా లేరని ఎక్కువ మంది నమ్ముతున్నారు. ఇటీవలి పరిణామాలు అందుకు సాక్ష్యంగా కనిపిస్తున్నాయి. కుమారుడి చదువు అనేది వ్యక్తిగత విషయమైనప్పటికీ, రాజకీయాల్లో



టైమింగ్ ముఖ్యం కాబట్టి, ఆయన పర్యటన వెనుక రాజకీయ వ్యూహం కూడా ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆయన కొంత అసంతృప్తితో ఉన్నారని, అందుకే ఈ విదేశీ పర్యటనను ఒక సాకుగా తీసుకున్నారని ప్రత్యర్థి వర్గాలు ప్రచారం చేస్తున్నాయి.హరీష్ రావు లేని సమయంలో తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికీ పార్టీ గాడిన పడకపోవడం, పార్టీ పునర్నిర్మాణం వంటి సవాళ్లతో సతమతమవుతున్న బీఆర్ఎస్ నాయకత్వానికి, హరీష్ రావు గైర్హాజరీ ఒక లోటుగానే కనిపిస్తోంది. ఆయన అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత పార్టీలో తన పాత్రపై ఎలాంటి స్పష్టత ఇస్తారో వేచి చూడాలి. ప్రస్తుతం ఆయన అమెరికా పర్యటన మాత్రం బీఆర్ఎస్ లో ఏదో జరుగుతోందన్న గాసిప్స్ కు మరింత ఆజ్యం పోసింది

# బ్రాండ్ పేరిట బరితెగింపు!

**మెదక్, నల్గొండ :** పసిపిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ, వారి భవిష్యత్తుకు పునాది వేయాల్సిన అంగన్వాడీ కేంద్రాలు ఇప్పుడు అవినీతి తిమింగలాలకు కాసుల కురిపించే కేంద్రాలుగా మారాయి. నల్లగొండ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు, ట్యూబ్లైట్ల సరఫరా పేరుతో లక్షల రూపాయల ప్రజాధనాన్ని నిలువునా ముంచేశారు. బ్రాండెడ్ వస్తువుల ధరలు చూపించి.. నాసిరకం మోడళ్లను అంటగడుతూ దాదాపు రూ. 10 లక్షల మేర చేతివాటం ప్రదర్శించిన వైనం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్ గా మారిందనే ప్రచారం జోరుగా సాగుతుంది.వాస్తవానికి జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ప్రత్యేక చొరవతో అంగన్వాడీల రూపురేఖలు మార్చాలని భావిస్తే, క్షేత్రస్థాయి అధికారులు మాత్రం ఆయన ఆశయాలకు తూట్లు పొడిచినట్లు తెలుస్తుంది. మినరల్ ఫండ్స్ నిధులను మళ్లించేందుకు వేసవి సెలవులను అస్త్రంగా చేసుకున్న అక్రమార్కులు, బినామీ టెండర్లతో ఐసీడీఎస్ కార్యాలయాన్నే అవినీతికి అడ్డాగా మార్చేశారు. రూ. 2200 ఫ్యాన్కు బిల్లు పెట్టి రూ. 1400 వస్తువును సరఫరా చేస్తూ నయా స్కామ్కు తెరలేపారని జిల్లాలో జోరుగా చర్చలు సాగుతున్నాయి.నల్లగొండ జిల్లాలోని 802 అంగన్వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు, 1060 కేంద్రాలకు ట్యూబ్లైట్లు సరఫరా చేసేందుకు కలెక్టర్ మినరల్ ఫండ్స్ నుంచి సుమారు రూ.20 లక్షలు కేటాయించారు. అయితే కాంట్రాక్ట్ నిబంధనలను సదరు కాంట్రాక్టర్ తుంగలో తొక్కినట్లు తెలుస్తుంది. టెండర్



ప్రకారం రూ. 2,243 విలువైన 'క్రాంప్టన్ హైస్పీడ్ హెచ్పీ ప్లస్' మోడల్ సరఫరా చేయాలి. కానీ వాస్తవికంగా సరఫరా అయింది మాత్రం కేవలం రూ. 1,400 విలువ చేసే 'సీవైండ్' మోడల్. అంటే ప్రతి ఫ్యాన్ మీద రూ. 843 నొక్కేసినట్లు విశ్వసనీయ సమాచారం.అంటే ఒక్క ఫ్యాన్ల కొనుగోలులోనే రూ. 7 లక్షల కుంభకోణం జరిగినట్లు అంచనాలు వేస్తున్నారు. ఇదే సమయంలో రూ. 264 విలువైన 'ఫిలిప్స్ 3-ఇన్-1 ఎల్ఈడీ' లైట్లకు బదులుగా, మార్కెట్లో కేవలం రూ. 110 లకే దొరికే అత్యంత నాసిరకమైన స్లిమ్ మోడళ్లను సరఫరా చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో దాదాపు రూ. 2 లక్షల నిధులు పక్కదారి పట్టాయనీ స్థానికంగా వినిపిస్తుంది సాధారణంగా ఏప్రిల్లో జరగాల్సిన సరఫరాను కావాలనే వేసవి సెలవుల వరకు సాగదీసినట్లు సమాచారం. అంగన్వాడీ కేంద్రాలు మూసి ఉంటే.. ఎవరూ క్వాలిటీని తనిఖీ చేయరనేది వీరి మాస్టర్ ప్లాన్. జిల్లా కొనుగోలు కమిటీ పర్యవేక్షణ లేకుండానే మెటీరియల్ను నేరుగా సెక్టార్ ఆఫీసులకు పంపించి, సూపర్వైజర్ ల ద్వారా సంతకాలు చేయించుకోవడం వెనుక పెద్ద నెట్వర్కే ఉందనేది అందరు గమనిస్తున్న విషయమే.ఈ మొత్తం స్కామ్ వెనుక ఐసీడీఎస్ కార్యాలయంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన ఒక డిప్యుటేషన్ ఉద్యోగి పాత్ర ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి నకిరేకల్ పరిధిలో ఉండాల్సిన ఆ వ్యక్తి, జిల్లా ఆఫీసులో చక్రం తిప్పుతూ హైదరాబాద్కు చెందిన తన బినామీలతో టెండర్లు వేయించి ఈ దోపిడీకి తెరలేపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సంగారెడ్డి జిల్లాలో అంగన్వాడీలను అభివృద్ధి చేసిన అనుభవంతో నల్లగొండలోనూ అదే మార్పు తేవాలని వాస్తవికంగా కలెక్టర్ భావించి ఫిట్టింగ్ చార్జీలు కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చి మరీ నిధులు కేటాయిస్తే.. క్షేత్రస్థాయిలో యంత్రాంగం మాత్రం ఆయన నమ్మకాన్ని వమ్ము చేస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయినాణ్యత లేని ఫ్యాన్లు, ట్యూబ్లైట్ల వల్ల భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరు? కేవలం కమీషన్ల కోసం చిన్నారుల సౌకర్యాలను తాకట్టు పెట్టిన ఈ నిధుల వేటగాళ్లపై సమగ్ర విచారణ జరిపి, అక్రమార్కుల నుంచి కాజేసిన నిధులను రికవరీ చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు బలంగా కోరుతున్నారు. అలాగే అవినీతి తంతుకు తెరలేపిన వ్యక్తులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు.

## 2034 తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్తా

-మొదటిపేజీ తరువాయి

తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని కూడా ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీ పేరును ఒప్పిస్తామని తెలిపారు.

**దేశానికి కూడా సేవలందిస్తా..**

ఇండియా కూటమి తరపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఇక్కడి ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ప్రజలకు ప్రపంచస్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో టిమ్స్ ఏర్పాటు చేశాం


**హైదరాబాద్** నగర ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో నాడు బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ టిమ్స్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. గతంలో గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారమైతే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యాధునిక టిమ్స్ హాస్పిటల్స్ అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎర్రగడ్డలోని టిమ్స్ ఆస్పత్రి పనులను శుక్రవారం ఉదయం కేటీఆర్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "హైదరాబాద్‌లో ఘా××మీ స్థాయి వైద్యం అందించేలా టిమ్స్‌ను ఆలోచించి రూపకల్పన చేశాం" అని తెలిపారు. సనత్‌నగర్ టిమ్స్ కోసం 22 ఎకరాల విస్తీర్ణాన్ని వినియోగించామని పేర్కొన్నారు. అత్యాధునిక టెక్నాలజీ, ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో హాస్పిటల్ నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు పోటీగా పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం టిమ్స్‌ను తీసుకువచ్చిందని అన్నారు. హైదరాబాద్‌లో సనత్‌నగర్, ఎల్బీనగర్, ఆల్వాల్ ప్రాంతాల్లో టిమ్స్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. వరంగల్‌లో 2000 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. నిమ్స్ ఆసుపత్రిని కూడా భారీ స్థాయిలో విస్తరణ పనులు మొదలుపెట్టామని చెప్పారు. సనత్‌నగర్ టిమ్స్‌లో మొత్తం మూడు బ్లాకులు నిర్మించామని తెలిపారు. 300 ×జఖ బెడ్స్‌తో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రోగుల బంధువుల కోసం ప్రత్యేక ధర్మశాల ఏర్పాటు చేశామని తెలిపారు. రూ.1200 కోట్ల వ్యయంతో టిమ్స్ నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. "కేసీఆర్ ప్రభుత్వం కొనసాగి ఉంటే ఈ ఆసుపత్రి రెండేళ్ల క్రితమే పూర్తయ్యేది" అని తెలిపారు. ఈ టిమ్స్‌లో 16 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు. వీ=×, జు ూఘ్మఅ సహా అన్ని డయాగ్నస్టిక్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రత్యేక ఎ×గా సూట్స్ కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కిడ్నీ సంబంధిత వ్యాధులపై ప్రత్యేక పరిశోధనలు జరిగేలా సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధిక వైద్య సిబ్బందితో కూడిన ప్రభుత్వ వైద్య వ్యవస్థగా టిమ్స్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రత్యేక రీసెర్చ్ బ్లాక్స్, అకాడెమిక్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు. భారీ ఆడిటోరియం నిర్మాణం కూడా చేపట్టినట్లు తెలిపారు. ఒకేసారి 1000 కార్లు పార్క్ చేసేలా ఆధునిక పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశామని చెప్పారు. "టిమ్స్ హాస్పిటల్ డిజైన్ దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ వైద్య నిర్మాణాల్లో ఒకటి" అని కేటీఆర్ పేర్కొన్నారు. అత్యవసర సేవల కోసం ప్రత్యేక ఎమర్జెన్సీ ర్యాంప్ నిర్మించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 350 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి ప్రజలకు చేరువలో వైద్యం అందించామని గుర్తుచేశారు. మిగిలిన నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

## గులాబీ జోరు అందుకుంటుందా?

-మొదటిపేజీ తరువాయి

రూపుతో షేపుతో తీర్చిదిద్దాలని కేసీఆర్ పార్టీ వర్గాలకు దిశా నిర్దేశం చేశారని అంటున్నారు బీఆర్ఎస్ విషయంలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టాలని కూడా డిసైడ్ అయినట్లుగా తెలుస్తోంది. అలాగే బీఆర్ఎస్ భవిష్యత్తు కార్యాచరణపై కూడా లోతైన చర్చ సాగింది అని అంటున్నారు. బీఆర్ఎస్ ని పూర్తిగా గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అధినాయకుడు కేసీఆర్ పార్టీ వర్గాలకు సూచించారు అని అంటున్నారు. గతానికి భిన్నంగా తెలంగాణా రాజకీయం మారుతోంది అని బీఆర్ఎస్ పెద్దలు గుర్తించారు. బీజేపీ తెలంగాణాలో అధికారం విషయంలో గట్టి పట్టుదలతో ఉందని కూడా అర్థం అవుతోంది. మోడీ బహిరంగ సభలో అయితే వచ్చేది బీజేపీనే అని స్ట్రాంగ్ స్టేట్మెంట్ ఇచ్చారు. బీజేపీ కనుక ఒక చోట అధికారంలోకి రావాలనుకుంటే దానికి సంబంధించి గ్రౌండ్ వర్క్ చాలా ముందుగానే రెడీ చేసి పెట్టుకుంటుంది. దానికి తాజా ఉదాహరణ పశ్చిమ బెంగాల్ లో ఆ పార్టీ ఘన విజయం. అసలు ఓటమి లేదు అనుకున్న మమతా బెనర్జీ ఓటమి పాలు అయ్యారు. దాంతో అంతకంటే బలమైన ప్రాంతీయ పార్టీల నేతలు ఎవరూ లేరని అంటున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ కూడా పూర్తి స్థాయిలో అలెర్ట్ అవుతోంది అని అంటున్నారు ఇక బీఆర్ఎస్ ని బూత్ లెవెల్ నుంచి గ్రామ వార్డు స్థాయి నుంచి కమిటీలతో నింపాలని నిర్ణయించారు. అలాగే నియోజకవర్గం స్థాయి జిల్లా స్థాయి వరకూ కూడా బలమైన సమర్ధులైన నాయకులతో పార్టీని పటిష్టం చేయాలని కూడా నిర్ణయించారు ఇక పార్టీ శ్రేణులలో సరికొత్త ఉత్సాహం నింపాలని రానున్న రోజులలో నేతలంతా జనంలో ఉంటూ బీఆర్ఎస్ ని పరుగులు పెట్టించాలని కూడా తీర్మానించారని అంటున్నారు. జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికలు జరిగినా విజయమే పరమాధిగా పార్టీ పోరాడాలని కూడా నిర్ణయించారు. మొత్తానికి 2028 ఎన్నికలకు బీజేపీ రెడీ అని మోడీ గట్టిగా చెప్పి వెళ్లారు. దాంతో బీఆర్ఎస్ కూడా జోరు చేస్తోంది అని అంటున్నారు. చూడాలి మరి రానున్న రోజులలో బీఆర్ఎస్ స్పీడ్ ఏ విధంగా ఉంటుందో.

## ఇంటర్ విద్యలో భారీ మార్పులు



**హైదరాబాద్ :** ఇంటర్ విద్యలో కీలక మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యాసంవత్సరం నుంచి ఈ నూతన విధానం అమలు చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. మొత్తంగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను ప్రవేశపెట్టింది. సైన్స్ విద్యార్థులకు గతంలో ఉన్న 30 మార్కుల ప్రాక్టికల్స్ విధానాన్ని రెండు సంవత్సరాలకు విభజించింది. ఇకపై ఇంటర్ మొదటి సంవత్సరంలోనూ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీకి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలకు ఫస్ట్ ఇయర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కులు కేటాయించనున్నారు. గణితంలోనూ యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను ప్రవేశపెట్టింది. గణితంలో 75 మార్కులకు బదులు 60 మార్కులకు ఫైనల్ (థియరీ) పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్నల్ అసెస్మెంట్‌కు ఒక్కో ఏడాదికి అంటే ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌కు 15 మార్కులు చొప్పున కేటాయించనున్నారు. అదేవిధంగా హ్యూమానిటీస్‌లో కూడా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు 20 మార్కులు కేటాయిస్తారు. ఫైనల్ థియ రీ పరీక్షలు 100 మార్కులకు బదులు 80 మార్కులకే నిర్వహించనున్నారు. భాషా (లాంగ్వేజెస్) సబ్జెక్టులలోనూ 100 మార్కులకు బదులు 80 మార్కులకు ఫైనల్ థియరీ పరీక్షలు, 20 మార్కులు ఇంటర్నల్ అసెస్మెంట్‌కు కేటాయించనున్నారు. ఎంఈసీ మ్యాథమెటిక్స్‌కు గతంలో ఇంటర్నల్ అసెస్మెంట్ ఉండేది కాదు. 75 మార్కులకు థియరీ పరీక్షే ఉండేది. కానీ ఇప్పుడు 20 మార్కులను ఇంటర్నల్ అసెస్మెంట్‌కు, 80 మార్కులు థియరీ పరీక్షకు కేటాయిస్తారు.


# సంపాదకీయం

## ఎన్నాళ్లీ లీకులు

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు మహారాష్ట్రలోని నాసిక్ వైద్యుడు డాక్టర్ శుభం ను సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. విచారిస్తున్న క్రమంలో దారుణమైన నిజాలు బయటపడుతున్నాయి. శుభం వైద్యుడిగా కొనసాగుతున్నాడు. కానీ ఒక్కరోజు కూడా మెడికల్ కాలేజీకి వెళ్లలేదు. ఇతడి స్వస్థలం నందగావ్. ఇతడు నాసిక్ ప్రాంతంలో కోచింగ్ కారిడార్ ప్రాంతంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. దాని నేమ్ బోర్డు లో శుభం పేరు ముందు డాక్టర్ అని రాసి ఉంటుంది. స్థానికంగా అతడు తనను తాను డాక్టర్గా పరిచయం చేసుకున్నాడు. అంతేకాదు ఎంబిబిఎస్, బిడిఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ కోర్సులలో అడ్మిషన్ల కోసం ప్రయత్నాల సాగించే విద్యార్థులకు అతడు సలహాలు ఇస్తుంటాడు. 2021లో భోపాల్ సమీపంలోని సత్యసాయి యూనివర్సిటీలో బ్యాచ్లర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సు ఇతడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే పోలీసులు విచారణలో ఆ యూనివర్సిటీ వీసీని సంప్రదించారు. అప్పుడు అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేవలం అడ్మిషన్ సమయంలోనే శుభం యూనివర్సిటీ కి వెళ్ళాడు. ఆ తర్వాత తరగతులకు హాజరు కాలేదు.నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం ముందుగా రాజస్థాన్లో వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత విచారణ జరుగుతున్న కొద్ది అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పేపర్ ను శుభం పదిలక్షలకు కొనుగోలు చేశాడు. కొరియర్ లో ప్రశ్నపత్రం వస్తే.. దానిని పిడిఎఫ్ లాగా మార్చాడు. ఆ తర్వాత దానిని గురుగ్రామ్ ప్రాంతంలో ఒక వ్యక్తికి 15 లక్షలకు అమ్మాడు. ఈ పేపర్ మొత్తం అనేక రాష్ట్రాలను చుట్టింది. పలువురు విద్యార్థులు రెండు నుంచి ఐదు లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. అయితే క్వశ్చన్ పేపర్ లీకేజీ బయటపడడంతో.. శుభం పరారీ లో ఉన్నాడు. తర్వాత తనను ఎవరు గుర్తుపట్టకుండా ఉండడానికి గుండు చేయించుకున్నాడు. అయితే పోలీసులు డిజిటల్ ఆధారాలు సేకరించి అతడిని అరెస్ట్ చేశారు. శుభం సోదరుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్ అనేది ఈ పరీక్ష రాసిన విద్యార్థుల గుండెల్లో దిగి న బాకు మాత్రమే కాదు, లక్షలాది జీవితా ల్లో ఒక్కసారిగా వెలుగు ఆరిపోవడం లాంటి ది కూడా. నెలల తరబడి కాదు, ఏళ్లుగా నిద్ర మానేసి, ఫోన్లు దూరం పెట్టి, పండుగలు వదిలేసి, తమ యౌవనాన్ని ప్రశ్నాపత్రాల మధ్య బంధించిన పిల్లలకు పరీక్ష రద్దు అనే రెండు మాటలు వార్తలా వినిపించవు. అవి గుండెలమీద పడే బరువులా అనిపిస్తాయి.పాపం, పుణ్యం తెలియకుండా కష్టాన్ని మా త్రమే నమ్ముకొని ఈసారి బాగా రాశామని, మంచి ర్యాంకు వస్తుందని ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు ఇప్పుడు మళ్లీ సందిగ్ధంలో పడ్డారు. విద్యార్థుల కంటే ఎక్కువగా వారి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతు న్నారు. పైసా పైసా కూడబెట్టి పిల్లలను చదివించారు. కొందరు బంగారం అమ్మారు. మరికొందరు పొలాలు తాకట్టు పెట్టారు.మధ్యతరగతి కుటుంబాల్లో డాక్టర్ అవ్వాలనే కల ఒక వృత్తిపై ఆశ మా త్రమే కాదు. అది ఒక తరాన్నే మార్చే ఆశ యం. ఇప్పుడు వారిని వెంటాడుతున్నది పరీక్ష రద్దయిందనే బాధ మాత్రమే కాదు, మళ్లీ అదే స్థాయిలో రాయగలమా? అనే భ యం కూడా. ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడం సాధ్యమే కావచ్చు. కానీ, ఒకసారి విరి గిపోయిన మనసును తిరిగి అదే ధైర్యంతో నిలబెట్టడం అంత సులభం కాదు.పేపర్ లీక్ అయిందని, నిర్వహణలో లో పాలు జరిగాయని, అవకతవకలపై అనుమానాలు వచ్చాయని అధికారిక కారణాలు విని పించవచ్చు. కానీ, ఇక్కడ అసలు ప్రశ్న ఇం కొకటి ఉంది. దేశంలో అత్యంత కీలకమైన పరీక్షలలో ఒకటైన నీట్ను కూడా నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించలేకపోతే వి ద్యార్థులు ఇంకేం నమ్మాలి? పరీక్షల మీద నమ్మకం కూలిపోవడమనేది కేవలం విద్యావ్యవస్థ సమస్య కాదు. అది సమాజ నైతికత కదలిపోతున్నదని చెప్పడానికి సంకేతం.ఎందుకంటే పరీక్షలు కేవలం మార్కులు ఇ వ్వవు. నువ్వు కష్టపడితే ముందుకు వెళ్లగలవనే విశ్వాసాన్ని కూడా ఇస్తాయి. ఇప్పుడు అ దే విశ్వాసం ముక్కలవుతోంది. దేశవ్యాప్తం గా ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు నీట్ రాస్తున్నారు. వారిలో చాలా మంది సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. వాళ్లకు ప్రతిభ ఒక్కటే మూలధనం.కానీ, ఇప్పుడు ఎక్కడో, ఎవరో వ్యవస్థను మోసం చేస్తే తన కష్టం వృథా అవుతుందా? అనే భయం పెరుగుతోంది. ఇది ఏ విద్యార్థికైనా అత్యంత ప్రమాదకరమైన మానసిక స్థి తి. ఎందుకంటే ఆశ కోల్పోయిన యువత ఇ చ్చే నిశ్శబ్దం కన్నా భయంకరమైనది మరొకటి ఉండదు.నీట్ చుట్టూ ఇప్పుడు మరో పెద్ద ప్రశ్న నిలుస్తోంది. కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును ఒకే రోజు, ఒకే పరీక్షతో నిర్ణయించడం నిజంగా న్యాయమేనా? ఒక గ్రామంలో తె లుగు మీడియంలో చదివిన విద్యార్థి, అత్యం త ఖరీదైన కోచింగ్ తీసుకున్న నగర విద్యార్థితో ఒకేస్థాయిలో పోటీ పడుతున్నాడని చెప్పడం సులభం. కానీ, వాస్తవ పరిస్థితులు అంత సమానంగా లేవు. ఒకరికి టెస్ట్ సిరీస్లు, ప్రత్యేక శిక్షణ, డిజిటల్ సదుపాయా లు ఉంటే, మరొకరికి కనీసం సరైన విద్యుత్ సదుపాయం కూడా ఉండకపోవచ్చు.అయినా ఇద్దరికీ ఒకే మెరిట్ కొలమానం వర్తింపజేయడం నిజంగా సమానత్వమేనా? మెరిట్ అనే పదం వినడానికి గొప్పగా ఉంటుంది. కానీ ఆ మెరిట్ వెనుక కుటుంబ పరిస్థితి ఏమిటి? ఆర్థిక స్థితి ఏమిటి? అవకాశాలు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయి? అ నే ప్రశ్నలూ ఉంటాయి. కొందరు కార్పొరేట్ కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి సిద్ధమవుతుంటే, మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వనరుల మధ్య చదువుతు న్నారు. పరీక్ష అందరికీ ఒకటే కావచ్చు. కానీ, అవకాశాలు మాత్రం అందరికీ ఒకేలా లేవు.నీట్ వంటి పరీక్షలు వచ్చిన తర్వాత విద్య అంటే జ్ఞానం అనే భావన క్రమంగా బలహీనపడుతోంది. ఇప్పుడు చాలామంది విద్యా ర్థులు పాఠాన్ని అర్థం చేసుకోవడానికి కాదు, ప్రశ్నకు సరైన సమాధానం గుర్తుపెట్టుకోవడానికి మాత్రమే చదువుతున్నారు. పాఠశా లలు విద్య నేర్పే స్థలాలుగా కాకుండా, పరీక్షలకు సిద్ధం చేసే గదులుగా మారిపోతున్నా యనే విమర్శలు పెరుగుతున్నాయి. కోట్ల రూపాయల కోచింగ్ పరిశ్రమ విద్యార్థుల ఆశలను మాత్రమే కాదు, వారి భయాలను కూడా వ్యాపారంగా మార్చేసింది.ఉదయం నుంచి రాత్రి వరకు టెస్టులు, ర్యాంకులు, పోలికలు, ఒత్తిళ్లు... ఇవన్నీ కలిసి విద్యార్థి బాల్యాన్ని మెల్లగా మింగేస్తున్నాయి. డాక్టర్ కావాలనే కల ఇప్పుడు చాలామందికి సేవాభావం కంటే బతుకుపోరాటంగా మారిపో యింది. ఈ వ్యవస్థలో పిల్లలు చదువుకుం టూ పెరగడం లేదు. కేవలం ఒత్తిడి మధ్య పెద్దవాళ్లు అవుతున్నారు.

నీట్ గురించి మాట్లాడేటప్పుడు మనం మార్కులు, ర్యాంకులు, సీట్ల గురించి ఎక్కువగా మాట్లాడతాం. కానీ, విద్యార్థుల మాన సిక ఆరోగ్యం గురించి చాలా తక్కువగా చర్చిస్తాం. ఒక విద్యార్థి సంవత్సరాల కష్టం ఒక్క పరీక్షపై ఆధారపడినప్పుడు, అతని మనసులో భయం కలగడం సహజం. 'ఫలితం రాకపోతే నా విలువ ఏమిటి?' అనే ప్ర శ్న చాలామంది పిల్లల్ని కుంగదీస్తోంది. బ యటికి కనిపించేది చదువు మాత్రమే.కానీ వారు తమ మనస్సులలో ఒంటరితనం, ఆందోళన, నిరాశతో కూడిన యుద్ధం చేస్తున్నారు. పరీక్ష రద్దు వార్త వచ్చిన క్షణంలో కొందరు ఆగ్రహం వ్యక్తం చేసి ఉండొచ్చు. కొందరు ఏడ్చి ఉండొచ్చు. కానీ, ఇంకా ప్రమాదకరమైన స్పందన మరొకటి ఉంది. అది నిశ్శబ్దం. ఎందుకంటే చాలామంది పిల్ల లు ఇప్పుడు అలసిపోయారు; కేవలం చదువుతో కాదు, నిరంతర ఒత్తిడితో. ఇప్పుడు చేయాల్సింది మళ్లీ పరీక్ష నిర్వహించడం మాత్రమే కాదు. ముందుగా విద్యార్థుల నమ్మకాన్ని తిరిగి నిర్మించాలి. తప్పు ఎక్కడ జరిగిందో స్పష్టంగా చెప్పాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విచారణలు పారదర్శకంగా జరగాలి. ఎందుకంటే రహస్యంగా జరిగే విచారణలు అనుమానాలను మరింత పెంచుతాయి. పరీక్షా నిర్వహ ణ వ్యవస్థను సాంకేతికంగా మరింత భద్రం గా మార్చాలి. ప్రశ్నాపత్రాల రవాణా నుంచి పర్యవేక్షణ వరకు ప్రతి దశలో డిజిటల్ ట్రాకింగ్ ఉండాలి.అంతకంటే ముఖ్యంగా, ఒకే పరీక్షతో జీవితాన్ని నిర్ణయించే విధానం గురించి దేశవ్యాప్తంగా పెద్ద చర్చ ప్రారంభం కావాలి. స్కూల్ విద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలా? బహుళ దశల మూల్యాంకనం అవసరమా? రాష్ట్ర విద్యావ్యవస్థల పాత్ర పెరగాలా? అనే ప్రశ్నలపైనా చర్చ జరగాల్సిన అవసరం ఉంది.విద్యార్థులకు ప్రత్యేక మద్దతు, స్థానిక భాషల్లో నాణ్యమైన వనరులు అందుబాటులోకి రావాలి. అలాగే ప్రతి కీలక పరీక్ష తర్వాత విద్యార్థులకు, తల్లిదండ్రులకు మానసిక కౌన్సెలింగ్ సపోర్ట్ కూ డా అవసరం. ఎందుకంటే పిల్లలు విఫలమవుతున్నది చదువులో కాదు, ఒత్తిడిని ఒం టరిగా మోయడంలో.దేశ భవిష్యత్తు పరీక్షా హాళ్లలో కూర్చు న్న ఆ పిల్లల చేతుల్లోనే ఉంది.

# పొదుపు సూత్రాల వెనుక వైఫల్యాలు




పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో భవిష్యత్తులో భారత్ పెను ప్రభావాలకు లోనవుతున్నదని, ప్రజలంతా పొదుపు సూత్రాలు పాటించాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. దేశభక్తి ప్రదర్శిస్తూ దేశాభివృద్ధికి తోడ్పడాలని ఉపదేశాలు ఇవ్వడంతో యావత్ దేశం ఉలిక్కిపడింది. జీఎస్టీ తగ్గించాం.. వస్తువులు కొనండి, దీపావళి, విజయదశమి పండుగ సంబరాల్లో మునగండని, నిన్నమొన్నటివరకు దేశం మూడో ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని ప్రగల్భాలు పలికిన ప్రధాని హఠాత్తుగా యూటర్న్ తీసుకున్నారు. 'బంగారం కొనొద్దు, విదేశీ ప్రయాణాలు చేయొద్దు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ఆదా చేయండి, రైతులు ఎరువులను, ప్రజలు వంట నూనెలను తక్కువగా వాడాలంటూ ' అంటూ పొదుపు సూత్రాలు వల్లించారు. ప్రధాని మోదీ స్వభావాన్ని పన్నెండేండ్లు గా గమనిస్తే ఒక విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. విజయం ఆయన ఖాతాలో, వైఫల్యాలను ఇతరుల ఖాతాలో జమ చేయడం ఆయన థియరీ. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమై సుమారు రెండున్నర నెలలు గడుస్తు న్నా, యుద్ధంతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకకు మోదీ సరైన చర్యలు తీసుకోలేదు. దాదాపు 80% శాతం చమురు, గ్యాస్ వంటివి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటాం. ఇందులో అత్యధికంగా హొర్ముజ్ జలసంధి ద్వారా మనకు చేరుతాయి. అయినా ప్రధాని దృష్టి సారించలేదు. పశ్చిమాసియా సంక్షోభం, రాబోయే కాలం లో భారత్ ఎదుర్కొనే గ్యాస్, చమురు, ఎరువులు, వంట నూనెల కొరత, ముఖ్యంగా విదేశీమారక నిల్వలు తగ్గుదల వంటి పలు సమస్యల పరిష్కారం కోసం అని చెప్తూ ప్రజలకు ప్రధాని పొదుపు సూత్రాలు బోధించారు. ఇటువంటి సమస్యలు వస్తాయని ఆయనకు ముందే తెలుసు. కానీ డబుల్ ఇంజిన్ సర్కార్లు ఏర్పాటు చేయడానికి, ఎన్నికల్లో కల్లబొల్లి కబుర్లు, విభజన రాజకీయాలు చేసి, వారు అనుకున్న రాష్ట్రాల్లో అధికారం కోసం వాస్తవాలు దాచిపెట్టారు. దేశ ఆర్థిక పరిస్థితిపై నిజాలు దాచటం ఎంతవరకు సమంజసం? ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజలను మోసం చేయటమే! ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తకుండా దేశభక్తి, మత క్రతువుల పేరుతో తప్పించుకోవటం బీజేపీ నేతలకు అలవాటే. ప్రజలు, ముఖ్యంగా జెన్జీ యువత ఈ విషయం గ్రహించాలి. పెద్దవాళ్లు యువతకు అర్థమయ్యేలా చెప్పాలి. 2016లో అర్ధరాత్రి ఆగమేఘాలపై ప్రధాని మోదీ పెద్దనోట్లను రద్దు నిర్ణయం ప్రకటించారు. అప్పుడు ప్రారంభమైన దేశ ఆర్థిక వ్యవస్థ పతనం, కోవిడ్ కాలంలో మరింత క్షీణించింది. ఇటీవలి కాలంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ట్రంప్ ప్రతీకార సుంకాలు, వలస వ్యతిరేక విధానాలు, తాజాగా అమెరికా-ఇరాన్ యుద్ధంతో మన దేశం అన్నిరంగాల్లో వెనుకబాట పట్టడంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి దాపురించింది. నిన్నమొన్నటి వరకు దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతున్నదని, జీడీపీ, బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నదని గొప్పలు చెప్పుకొని జబ్బలు చరుచుకున్న కేంద్ర పాలకులు యూటర్న్ తీసుకున్నారు. ఆర్థిక రంగ వైఫల్యంపై ఆరోపణల నుంచి బయటపడేందుకు ప్రధాని పొదుపు సూత్రాలు వల్లించారు.ఎన్నికలు అయిపోయాయి కనుక అతి త్వరలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే అవకాశం ఉన్నది. ఇక నిత్యావసర వస్తువులు, ఎరువుల ధరలు పెరిగి, దేశ ప్రజానీకం యావత్తు బతకడానికి ముప్పుతిప్పలు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదేనా మోదీ పన్నెండేండ్ల పాలనలో ప్రజలకు ఇచ్చే అచ్చేదిన్? ఏమి కొనాలి, ఏమి తినాలి అనే స్థాయికి దేశం దిగజారింది. నిరుద్యోగం, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, ఉపాధి లేమితో లక్షలాది కుటుంబాలు కునారిల్లుతున్నాయి. పుండుమీద కారం చల్లినట్టు మోదీ పొదుపు సూత్రాలు ప్రజల్లో మరిన్ని భయాలు సృష్టిస్తున్నాయి. అరవై ఏండ్లపాటు కాంగ్రెస్ పాలనలో దేశం ఏమీ అభివృద్ధి చెందలేదని చెప్పి, 2014లో కేంద్రంలో గద్దెనెక్కిన మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ పన్నెండేండ్ల పాలనలో ఏమి సాధించిందో ఇకనైనా తెలుపాలి. 2014లో రూపాయి మారకం విలువ 58 రూపాయలుగా ఉంటే.. నేడు 95.80కు పతనమైంది. మోదీ అధికారం చేపట్టే నాటికి విదేశీ రుణం 446 బిలియన్ డాలర్లు ఉంటే.. నేడు 755 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. నాడు ప్రతీ భారతీయుడిపై రూ.48,296 అప్పు ఉంటే.. ఇప్పుడు రూ.1,48,000 ఉన్నది. దేశంలో ఏదైనా సంక్షోభం వస్తే చేతులెత్తేయడం, నీట్గా దేశభక్తి ముసుగు తొడిగి మోదీ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఐదేండ్ల క్రితం కొవిడ్ కాలంలో, నేడు పశ్చిమాసియా సంక్షోభంలో ఇదే ధోరణిని మోదీ ప్రదర్శిస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్, గతిశక్తి, స్వచ్ఛ భారత్, మేకిన్ ఇండియా, వికసిత్ భారత్ వంటి నినాదాలతో దేశం పరుగులు పెడుతున్నదని లేని గొప్పలు చెప్పుకోవటం పరిపాటిగా మారింది. సమస్యలు, సంక్షోభాలు ఏర్పడితే చాకచక్యంగా వ్యవహరించి తప్పించుకుంటున్నారు. మోదీ పాలనలో కార్పొరేట్ దిగ్గజాలు భారీ సంపదను పోగేసుకుంటున్నాయి. కానీ దేశంలో సుమారు 80 శాతం ఉన్న పేద, మధ్యతరగతి ప్రజల తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు ఏమీ మెరుగుపడలేదని పలు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని పాలకులకు ధ్యాస లేదు. అందువల్లనే మన దేశాభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ గాలిబుడగలా తయారైంది.

ఇకనైనా ప్రజలు, యువ త పాలకుల విధానాలను, అసలు రంగును గ్రహించాలి. తమ జీవితాలకు, తలసరి ఆదాయం జీవన ప్రమాణాలు మెరుగుకు కృషి చేసే వారికి అధికారం ఇవఇవ్వడానికి తమ వంతు పాత్ర పోషించాలి. కుల, మత, వర్గ, ప్రాంతీయ భాషా తదితర అంశాల ఆధారంగా ఓట్లు దండుకునే పార్టీలను, నేతలను దూరంగా ఉంచడం మంచిది. జెన్జీ యువత తమ ఆకాంక్షలు నెరవేర్చే వారికే అధికారం ఇవ్వాలి. కట్టబెట్టడం ద్వారానే వికసిత్ భారత్ సాధ్యం. పౌర సమాజమా..నేటి పాలకుల విధానాలు వాస్తవరూపంలో విశ్లేషణ చేయాలి. మహనీయుడు లెనిన్ ఇలా చెప్పాడు 'పాలకుల విధానాలు, మాటల్లోని అంతరార్థం ప్రజలు గ్రహించలేనంత కాలం మళ్లీ మళ్లీ మోసపోతూనే ఉంటారు'. సుమారు శతాబ్దం క్రితం ఆయన చెప్పిన మాటలు నేటికీ వాస్తవమే కదా!

# పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు




అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఆ పార్టీ నేతలు ఒకసారి గుర్తుచేసుకోవాలి. అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్లో ఉన్న మూడు డీఏలను తక్షణం ఇస్తామన్నారు. ఒకటో తేదీన తప్పకుండా వేతనాలు వచ్చేలా చూస్తామన్నారు. సప్లిమెంటరీ బిల్లులను 15 పని దినాల్లో క్లియర్ చేస్తామని నమ్మబలికారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు పరుస్తామని చెప్పుకొచ్చారు. కానీ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పెద్దలు మ్యానిఫెస్టోలను అటకెక్కించారు... ప్రజలను మర్చిపోయారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కొత్త పీఆర్సీ ప్రకటించి, ఆరు నెలల్లోపు సిఫారసులను అమలు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడు ఉద్యోగులు పెన్షనర్లు అరిగోస పడుతున్నా హస్తం పార్టీనేతలు చోద్యం చూస్తున్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్తో అన్ని రకాల జబ్బులకు అన్ని దవాఖానల్లో వైద్యం అందించేలా హెల్త్ కార్డులు జారీ చేస్తామని బుకాయించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఓట్లే కీలకం. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటింది. ఇంతకాలం ఓపిక పట్టాం. కానీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. ఈ క్రమంలో ఉద్యోగ జేఏసీ 2025 మే నెలలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించగా, 'ఉద్యోగులకు ఇవ్వడానికి నా దగ్గర డబ్బులు లేవు. నన్ను కోసినా డబ్బులు లేవు. దేశంలో అప్పులు ఎవరూ ఇవ్వడం లేదు. అప్పు కోసం వెళ్తే దొంగలాగా చూస్తున్నారు. నేను ఏ సంక్షేమ పథకాలు ఆపి ఉద్యోగులకు ఇమ్మంటారు?' అని సీఎం రేవత్రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న మనిషి అనాల్సిన మాటలేనా ఇవి? ఇంత నిర్లక్ష్య ధోరణి ఏంటి?

ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత వచ్చే బెనిఫిట్స్ డబ్బులకు సంబంధించి, ఎన్నో ప్రణాళికలు వేసుకుంటారు. శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల అడియాశలు చేసింది. నిధుల కొరత ఉన్నదని చెప్తూ రిటైర్డ్ ఉద్యోగుల ప్రాణాలతో చెలగాటం దీంతో అనారోగ్యంతో దవాఖానపాలైన వారు తమ గోడు వినాలంటూ పాలకులకు వీడియో సందేశాల ద్వారా విన్నవించాల్సి వస్తున్నది. సుదీర్ఘ కాలం ప్రభుత్వంలో పనిచేసిన ఉదోగులుగా గౌరవంగా బతికిన వారు నేడు చికిత్సకు కూడా డబ్బులు లేక అరిగోస పడాల్సి వస్తున్నది. మరికొందరైతే తల్లిదండ్రులకు సరైన వైద్యం అందించలేక ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అవస్థను కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్రెడ్డికే దక్కుతుంది. డబ్బులు లేవు అంటున్న సర్కార్కు మూసీ సుందరీకరణకు రూ.1.5 లక్షల కోట్లు, గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రూ.5 వేల కోట్లు, ప్రపంచ అందాల పోటీలు, మెస్సీ ఫుట్బాల్ పోటీలు, గ్లోబల్ సమ్మిట్లకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆర్భాటాల కోసం ప్రజాధనాన్ని దుబారా చేస్తూ కోట్లాది రూపాయలు అప్పులు తెస్తున్నారు. కానీ రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు ఇవ్వడానికి మాత్రం డబ్బులు ఎందుకు లేవు? ఈ నేపథ్యంలో సమస్యల సాధనకు టీజీఈజేఏసీ ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. గత నెల 17న నిరసన ప్రదర్శనలు చేపట్టింది. మే 5వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో నిరాహార దీక్షలు నిర్వహించింది.

రిటైర్డ్ ఉద్యోగులు చేపట్టిన ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నింది. మే 2న ఉద్యోగుల జేఏసీతో చర్చల సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడడానికి 100 రోజుల్లో రూ. 6 వేల కోట్లు చెల్లిస్తామని సీఎం చెప్పారు. పీఆర్సీ రిపోర్టు తక్షణమే తెప్పించుకుంటామని, ఉద్యోగుల, పెన్షనర్లకు జూన్ 1 నుంచి హెల్త్ కార్డులు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీతో సమావేశం నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు. మరి ఏప్రిల్ 2026లో రూ.1,000 కోట్లు పెండింగ్ బిల్లులు కింద చెల్లించామని చెప్పారు కదా? ఆ వెయ్యి కోట్లు ఎవరెవరికి చెల్లించారు? దీనిపై శ్వేతపత్రం తక్షణం విడుదల చేయాలి. రూ.1,000 కోట్లలో సర్వీసులో ఉన్న వారికి రూ.500 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు రూ.500 కోట్లు అని ప్రకటించారు. రిటైర్డ్ ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు రెండున్నరేండ్లయినా చెల్లించకపోవడం దారుణం. జడ్పీ జీపీఎఫ్ ఉన్నవారికి 2025 అక్టోబర్ వరకు చెల్లించకపోవడం అన్యాయం. సర్కార్ వైఖరి తీవ్ర అభ్యంతరకరం.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ 25 నెలలుగా చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 92 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు అప్పులు తీర్చలేక మానసిక వేదన, అనారోగ్యంపాలై చనిపోయారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రిటైరైన 22,000 మందిలో బకాయిలు రాని దాదాపు 18,000 మంది కుటుంబాలను కాపాడాలని కోరుతున్నాం.

కొంతమంది పెన్షనర్లు హైకోర్టును ఆశ్రయించారు. వారికి పూర్తిస్థాయిలో చెల్లించకపోవడం కోర్టు ధిక్కరణ అవుతుంది. కనుక జూన్ 10-15 లోపు బకాయిలు చెల్లించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, కోర్టుకు రాని వారితో సహా ప్రతి ఒక్కరికీ ఏకమొత్తంలో అన్ని బకాయిలు చెల్లించాలని బాధిత పెన్షనర్ల సంఘం పక్షాన డిమాండ్ చేస్తున్నాం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైవీ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం డీఎస్ నకార కేసులో 1982 డిసెంబర్ 17న ఇచ్చిన తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం 'పెన్షన్ ప్రభుత్వాలు ఇచ్చే భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు' అని ప్రభుత్వం గుర్తించాలి.

శనివారం 16 మే 2026
అగ్నిధార

# కడ్తాల్, మాధారం విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

## చీఫ్ ట్రాఫిక్ మేనేజర్" కు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

మక్తమాధారం, రేఖ్య తండా మరియు కడ్తాల్ గ్రామాల నుండి ఇబ్రహీంపట్నం వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మాజీ సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు లక్ష్మీ నర్సింహ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలతో కలిసి శుక్రవారం హైదరాబాద్ నగరం బస్ భవన్ లో తెలంగాణ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ శ్రీదేవిని కలిసి సమస్యలను వివరించారు. ప్రతిరోజు మక్తమాదారం కడ్తాల్ గ్రామాల నుండి ఉన్నత విద్య కోసం విద్యార్థులు ఇబ్రహీంపట్నంకు పదుల సంఖ్యలో ప్రయాణం చేస్తున్నారని వీరికి సరైన సమయంలో బస్సులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు మేనేజర్ కు వివరించినట్లు తెలిపారు. ఉన్నత విద్య కోసం ఇబ్రహీంపట్నం వెళుతున్న విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం 7 గంటలలోపు మాదారం నుండి కడ్తాల్ మీదుగా ఇబ్రహీంపట్నం వరకు ప్రస్తుత ఉన్న ఇబ్రహీంపట్నం డిపో బస్సును కొనసాగిస్తూ, తిరుగు ప్రయాణం కొరకు సాయంత్రం 4 గంటలకు ఇబ్రహీంపట్నం నుండి బయలుదేరి,కడ్తాల్ మీదుగా మాదారం వరకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని మేనేజర్ ను కోరినట్లు తెలిపారు. అదేవిధంగా ఫలక్ నుమా డిపోకు చెందిన బస్సు కొత్తపేట నుండి మాదారం వరకు పొడిగించాలని కోరినట్లు తెలిపారు. విద్యార్థులకు మరియు ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మక్తమాదారం మాజీ సర్పంచ్ సులోచన సాయిలు,ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, సత్యనారాయణ గౌడ్, మల్లేష్,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పశువుల రవాణాపై అప్రమత్తంగా ఉండాలి


**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**

**అగ్నిధారన్యూస్ సుల్తానాబాద్**



బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం రోజున పెద్దపల్లి జోన్ సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బపల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేసి,వివరాల నమోదు రిజిస్టర్లను పరిశీలించారు. సీపీ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి,ప్రతి వాహనం,పశువుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు. అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని తెలిపారు. పండుగ సమయంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సీపీ వెంట పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ,సుల్తానాబాద్ సీఐ రంజిత్,సుల్తానాబాద్ ఎస్ఐ చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకోవాలి




**ప్రైవేటీకరణ విధానాలతో కార్మికులకు ముప్పు : జనార్దన్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాల వల్ల ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రమాదంలో పడుతున్నాయని, వాటి పరిరక్షణకు కార్మికులు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర ప్రభుత్వ రంగ సమన్వయ కమిటీ చైర్మన్ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని మెయిన్ చౌరస్తాలోని శ్రామిక భవన్‌లో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణపై జిల్లా సదస్సు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ రావు, బీడీఎల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సత్తయ్య, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. రాజారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. ముత్యం రావు తదితరులు పాల్గొన్నారు. సదస్సులో మాట్లాడిన వక్తలు 1991లో ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలతో దేశంలో ప్రైవేటీకరణ వేగం పెరిగిందని పేర్కొన్నారు. అప్పటి నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు, దేశవ్యాప్త సమ్మెలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వాల విధానాల్లో మార్పు రాలేదని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే సింగరేణి, ఎన్‌టీపీసీ, బీడీఎల్, విద్యుత్, ఆర్ఎఫ్‌సీఎల్ వంటి సంస్థల్లో శాశ్వత ఉద్యోగాల సంఖ్య తగ్గిపోగా, కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరుగుతోందన్నారు. నాలుగు లేబర్ కోడ్ల ద్వారా కార్మిక హక్కులను బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని, ప్రభుత్వ రంగ సంస్థలు కొనసాగితేనే కార్మికుల భవిష్యత్ భద్రంగా ఉంటుందని తెలిపారు. ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎం. రామాచారి, ఉపాధ్యక్షులు ఎన్. భిక్షపతి, డి. కొమురయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, శివరాం రెడ్డి, యాకుబ్, మల్లేష్, నరహరిరావు, భూమయ్య, రాజమౌళి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీహరి, రాఘవరెడ్డి, ఎద్దు కుమార్, ఓదెలు, సమ్మయ్య, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్మ కిష్టారెడ్డి ట్రస్ట్ ద్వారా డిగ్రీ విద్యార్థులకు బంగారు పతకాల ప్రధానం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శర్వాణి ఆధ్వర్యంలో గ్రంథాలయ పుస్తకాల దాతలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎడ్మ కిష్టారెడ్డి స్మారక ట్రస్ట్ ఫౌండర్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మరియు మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం రూ.50 వేలను, మెరిట్ విద్యార్థులకు ప్రతి సంవత్సరం బంగారు పతకాలను అందిస్తామని వారన్నారు. ఇంతకు ముందు డిగ్రీ కళాశాల విద్యార్థుల అభివృద్ధికి రూ.1.50 వేల విలువైన పుస్తకాలను ప్రధానం చేశామని వారు గుర్తు చేశారు. అదేవిధంగా మానవతా ఫౌండేషన్ వారు పుస్తకాల అల్మారాలను మరియు టీఎన్జీవో తాలూకా అధ్యక్షులు సురేష్ గౌడ్ పోటీ పరీక్షల కోసం భారత రాజ్యాంగానికి సంబంధించిన 50 పుస్తకాలను బహూకరించారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని వారు అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పదిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం.



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

స్థానిక కల్వకుర్తి వికాస్ టెక్నో స్కూల్లో టాపర్లకు ఘనంగా సన్మానం చేశారు. వర్షిత్, అభిరామ్, సంజయ్ ఐదువందల పైగా మార్కులు సాధించిన విద్యార్థులను వాళ్ల తల్లిదండ్రుల సమక్షంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్ రాఘవాచారి మాట్లాడుతూ మా పాఠశాలలో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించారు,విద్యార్థులు పట్టుదల, ఇష్టంతో చదివితే ఎంతటి విజయానైనా సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్, మహమ్మది, రామలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాసులు, యాదయ్య, రాణి పాల్గొన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత




**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల్ వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

అమంగల్ మున్సిపల్ 12వార్డ్ లోని పోలిశెట్టి నందు తండ్రి పేరు లక్ష్మయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడంతో స్థానిక టిఆర్ఎస్ పార్టీ నాయకులు కౌన్సిలర్ పాపిశెట్టి రాము , జగన్ ద్వారా రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మ న్ ఉప్పల వెంకటేష్ నీ సంప్రదించగా వెంటనే స్పందించి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణం కోసం స్టీల్ సిమెంట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ కౌన్సిలర్ 12వార్డ్ నాగిళ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు

## మానవసేవయే మాధవసేవ అంటూ

**రాగి అంబలి పంపిణీ చేసిన హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి షఫీ బాబా**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



తలకొండపల్లి మండలంలోని వెల్జల్ గ్రామంలో మానవసేవయే మాధవసేవ అంటూ తెలంగాణ రాష్ట్రంలోని వేసవి కాలంలో ప్రజల యొక్క ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు, యువకులు, వారి వారి ప్రాంతాలలో మజ్జిగ, మంచినీటి సదుపాయాన్ని, రాగి అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల యొక్క దాహార్తిని తీర్చే విధంగా సేవా కార్యక్రమాలను చేయాలని కోరుతున్నాను ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అయిల్ శ్రీశైలం గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## శ్రమశక్తి అవార్డు గ్రహీత ఆకునూరి బాల అంకుష్‌కు ఘన సన్మానం

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

ప్రతిష్టాత్మకమైన శ్రమశక్తి అవార్డు అందుకున్న సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్జీ-2 ఉపాధ్యక్షుడు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పెద్దపల్లి జిల్లా కో-కన్వీనర్ ఆకునూరి బాల అంకుష్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. సీనియర్ జర్నలిస్టు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో బాల అంకుష్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి, స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. దశాబ్దకాలంగా సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో సేవలందించడంతో పాటు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘంలో కీలకపాత్ర పోషిస్తూ కార్మికులు, దళిత వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డును ప్రదానం చేసింది. శ్రమశక్తి అవార్డుకు బాల అంకుష్‌ను ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామికి బొంకూరి మధు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇరుగురాల కిష్టయ్య, బొంకూరి పవన్ కుమార్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

**పోక్సో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**




కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథపై నమోదైన పోక్సో కేసులో తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎన్టీపీసీ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్ మాట్లాడుతూ, మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలతో బండి సాయి భగీరథపై ఈ నెల 8న హైదరాబాద్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైందన్నారు. కేసు నమోదై పలురోజులు గడిచినా ఇప్పటివరకు నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. పోక్సో కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని తక్షణమే నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేయాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ పోలీసులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. గతంలో కూడా బండి సాయి భగీరథపై ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, దాడుల ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కేసు నుంచి బయటపడేందుకు బాధితురాలిపైనే కౌంటర్ కేసులు నమోదు చేయించడం దుర్మార్గమని ఆరోపించారు. రాజకీయ, ఆర్థిక ప్రభావాన్ని ఉపయోగించి కేసును మాఫీ చేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధిత మైనర్ బాలికకు భద్రత కల్పించి కేసును నిష్పక్షపాతంగా విచారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే బండి సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం మండల కార్యదర్శి గుమ్మడి వెంకన్న, టీయూసీఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఈసంపల్లి రాజేందర్, పార్టీ నాయకులు గొల్లపల్లి చంద్రయ్య, ఆడెపు శంకర్, కలవల రాయమల్లు, పుల్లూరి నాగభూషణం, చిలక రాజు, రాజయ్య, క్రాంతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# అధికార బలంతో న్యాయాన్ని కొనేస్తారా?

**కేంద్ర మంత్రి బండి సంజయ్ తీరుపై మేధావుల ఆగ్రహం**
**నిందితుడైన కొడుకు కోసం జడ్జి కుటుంబానికి పదవుల ఎర?**
**బాధితురాలికి అన్యాయం చేస్తే సహించం**
**డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ హెచ్చరిక**

**అగ్నిధార న్యూస్ ,(హైదరాబాద్):**

రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి, చట్టాన్ని రక్షించాల్సిన కేంద్ర మంత్రి బండి సంజయ్, తన కుమారుడి అకృత్యాలను కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థలను మేనేజ్ చేయాలని చూడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ ధ్వజమెత్తారు. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కాపాడేందుకు న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకురావడం హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు.

**బేరసారాల రాజకీయం..**

హైకోర్టు జడ్జి మాధవి దేవి భర్త హనుమంత్ రెడ్డికి బార్ కౌన్సిల్ చైర్మన్ పదవి ఇప్పిస్తామనే హామీతో బండి సంజయ్ బెయిల్ కోసం బేరసారాలు సాగిస్తున్నారనే వార్తలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ.. "బాధితురాలి పక్షాన నిలబడాల్సిన కోర్టులు, నిందితుల పరంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. సాక్షాత్తూ జడ్జి గారే నిందితుడి తరపు లాయర్ల వాదనలకు ప్రాధాన్యత ఇవ్వడం వెనుక ఉన్న రాజకీయం ఏంటో ప్రజలకు అర్థమవుతోంది" అని విమర్శించారు.

**ముసుగులో సనాతన ధర్మం!**

సనాతన ధర్మం పేరుతో రోడ్లెక్కి ర్యాలీలు చేసే నాయకులు, ఒక ఆడబిడ్డకు జరిగిన అన్యాయంపై ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన నిలదీశారు.

**డొల్లతనం:** "హిందువులంతా ఒక్కటే అని చెప్పే మాటలు కేవలం ఓట్ల కోసమేనా? తోటి హిందూ సోదరికి అన్యాయం జరిగితే ధర్మం ఏమైపోయింది?" అని ప్రశ్నించారు.

పోరాటం: అన్యాయంపై న్యాయం గెలిచే వరకు సమత సైనిక్ దళ్ తన గళాన్ని వినిపిస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

**న్యాయవ్యవస్థకు**

అగ్నిపరీక్ష..:డబ్బు, అధికారం ఉన్న వారికి ఒక న్యాయం, సామాన్యులకు ఒక న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజలు సహించబోరని నగేష్ హెచ్చరించారు. కేంద్ర మంత్రి కుమారుడికి బెయిల్ లభిస్తే న్యాయస్థానాల పట్ల ప్రజల్లో ఉన్న కొద్దిపాటి గౌరవం కూడా అంతరిస్తుందని, ఇది న్యాయవ్యవస్థకు ఎదురైన పెద్ద పరీక్ష అని ఆయన అభిప్రాయపడ్డారు.

## పోక్సో బాధితుల వివరాలు వెల్లడించడం నేరం



**చట్టాలపై అవగాహన లేకుండా తీర్పులిస్తారా?**
**డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి,):**

పోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితుల వివరాలను, వారి వ్యక్తిగత ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో వెల్లడించడం అత్యంత హేయమైన చర్య అని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ తీవ్రంగా మండిపడ్డారు. బాధితుల గుర్తింపును బహిర్గతం చేయడం చట్టరీత్యా నేరమని తెలిసినా, కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆయన ఆక్షేపించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఇటీవల సంచలనం సృష్టిస్తున్న ఒక కేసులో బాధితురాలి ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఏ అధికారంతో మీరు బాధితురాలి ఫోటోలను రివీల్ చేస్తున్నారు? అసలు ఆ ఫోటోలు బాధితురాలివేనా కాదా అనే విచక్షణ కూడా లేకుండా ఎలా పోస్ట్ చేస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలతో సంబంధం లేకుండా కొందరు తమకు తామే తీర్పులు ఇచ్చేయడం విచారకరమని పేర్కొన్నారు.

**రాజకీయ నాయకులు దూరంగా ఉండాలి**

ఇలాంటి సున్నితమైన కేసులను రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని నగేష్ సూచించారు. బాధితులకు అండగా నిలవాల్సింది పోయి, వారిని మరింత ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. గతంలో 'సుగాలి ప్రీతి' కేసులో బాధితురాలి కుటుంబం ఎదుర్కొన్న మానసిక క్షోభను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

**పోలీసుల మౌనంపై విస్మయం**

పోక్సో బాధితుల వివరాలు సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా చక్కర్లు కొడుతున్నా పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. చట్టం ముందు అందరూ సమానులనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాలని, తప్పుడు సమాచారాన్ని (రాంగ్ నెరేటివ్) ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా సంస్థలు కూడా తమ సొంత తెలివితేటలు వాడకుండా, కేవలం వాస్తవాలను మాత్రమే రిపోర్ట్ చేయాలని డా. మార్షల్ దుర్గం నగేష్ స్పష్టం చేశారు.

## బాలుడి కిడ్నాప్ కేసులో నిందితుడికి ఉరి శిక్ష

**పోలీస్, ప్రాసిక్యూషన్ బృందాన్ని అభినందించిన సీపీ సజ్జనార్**

**హైదరాబాద్ :** సనత్నగర్ బాలుడి దారుణ హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష పడేలా పకడ్బందీగా ఆధారాలు సేకరించి, కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన పోలీస్, ప్రాసిక్యూషన్ బృందాన్ని నగర పోలీసు కమిషనర్ వి సి సజ్జనార్ సన్మానించారు. ఈ శిక్ష ఖరారులో కీలక పాత్ర పోషించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వి. రామకృష్ణారావు, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ముత్తు యాదవ్, సనత్ నగర్ ఎస్హెచ్ఓ అశోక్, ఎస్ఐ అబ్దుల్ హయ్యుమ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ శేఖర్లను అభినందించారు. నేరస్థులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని ఈ ఉరిశిక్ష తీర్పు మరోసారి నిరూపించింది.

## శ్రీకట్ట మైసమ్మ తల్లికి 50 గ్రాముల వెండి బహుకరణ

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి**

పెద్దపల్లి పట్టణంలోని, ట్యాంక్ బండ్, శ్రీ కట్ట మైసమ్మ ఆలయానికి, 50 గ్రాముల వెండిని, చందపల్లె మాజీ ఎంపిటిసి, గంగుల భారతి- వెంకటేశం దంపతులు బహుకరించినారు. శ్రీ కట్ట మైసమ్మ ఆలయంలో, ప్రత్యేకమైన పూజలు నిర్వహించి, ఆలయ అర్చకులు, వారికి తీర్థ ప్రసాదంలో, పూలమాల, కండవతో సత్కరించి, వేద మంత్రాల ద్వారా ఆశీర్వదించినారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, బొద్దుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, శ్రీ కట్ట మైసమ్మ తల్లి, శుభాశీస్సులు అందరిపై ఉండాలని, పట్టణ ప్రజలు, సుఖ సంతోషాలతో, గడపాలని, అమ్మవారిని కోరన్నది. ఈ కార్యక్రమంలో, ఆలయ కమిటీ సభ్యులు, గండు రంగయ్య, భూత గడ్డ సంపత్, మున్సిపల్ కౌన్సిలర్, దొడ్డుపల్లి జగదీష్, రజక సంఘం అధ్యక్షులు బొడ్డుపల్లి రామ్మూర్తి, గుడికందుల మల్లయ్య, పవనూరి లక్ష్మణ్, గుడికందుల శ్రీనివాస్, ముక్కెర రాజేశం, రాచమల్ల అంజయ్య, మధునయా, బొడ్డుపల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ సీఐ కృష్ణ కుమార్‌కు ఘన సన్మానం



**బీసీ సంఘం నేతల మర్యాదపూర్వక భేటీ**
**శాంతిభద్రతల పరిరక్షణలో సేవలు అభినందనీయం**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ సీఐ కృష్ణ కుమార్‌ను శుక్రవారం పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలుసుకుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంథని రఘు మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు సీఐ కృష్ణ కుమార్ సమర్థంగా పనిచేస్తున్నారని అన్నారు. గతంలో కరీంనగర్‌లో అందించిన సేవల మాదిరిగానే రామగుండంలో కూడా ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించాలని ఆకాంక్షించారు.

పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయడంలో సీఐ కృష్ణ ముందుంటున్నారని పేర్కొన్నారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. ప్రజా సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ అందుబాటులో ఉంటున్నందుకు సీఐ కృష్ణ కుమార్‌కు బీసీ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర బీసీ ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ మంథని లక్ష్మణ్, బతుకమ్మ ఛానల్ రిపోర్టర్ కంది నాగరాజు, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బులగం రవీందర్ గౌడ్, ఏ. వెంకట్‌రెడ్డి, కాసులపూరి సాగర్, మంథని సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన వివిధ సమస్యలను వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు సమావేశంలో ప్రస్తావించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రేడ్లు పంపిణి




**షేర్ టూ షైన్ నినాదాంతో సేవా**
**జాతీయ అవార్డు గ్రహీత శివ కుమార్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం, ఆర్ట్ అఫ్ గివింగ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు, గర్భిణీ స్త్రీలకు పండ్లు, బ్రేడ్లు పంపిణి చేసారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహిత శివ కుమార్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్న నినాదంతో అచ్యుత్ సమంత "షేర్ టు షైన్" అనే పిలుపు మేరకు ఆర్ట్ అఫ్ గివింగ్ 13వ వార్షికోత్సవం సందర్బంగా దేశవ్యాప్తంగా అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయబోతున్నాము అని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్.ఎం.ఓ విష్ణు ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ రాహుల్, సేవా బృందం వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి తేజ, సభ్యులు ప్రవీణ్,హర్షిత్,బాను వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## కోట రవీందర్ రెడ్డికి 'శ్రమ శక్తి' అవార్డు



**పెర్క శ్యామ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):**

సింగరేణి ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డికి ప్రతిష్టాత్మక 'శ్రమ శక్తి' అవార్డు రావడం పట్ల కార్మిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా టీపీసీసీ నాయకుడు పెర్క శ్యామ్ ఆధ్వర్యంలో ఇంటక్ భవన్‌లో గురువారం కోట రవీందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పెర్క శ్యామ్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న కోట రవీందర్ రెడ్డికి 'శ్రమ శక్తి' అవార్డు రావడం గర్వకారణమన్నారు. సింగరేణి కార్మికుడిగా, కార్మిక నాయకుడిగా ఆయన చేసిన సేవలకు ఇది సరైన గుర్తింపని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి కార్మిక లోకానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గాండ్ల మోహన్, మాజీ జడ్పీటీసీ గంట రమణరెడ్డి, ఇంటక్ సీనియర్ నాయకుడు బత్తుల శంకర్, ఉపసర్పంచ్ అసం సతీష్‌తో పాటు పలువురు కాంగ్రెస్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని కోట రవీందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ప్రజలపై భారాలు

**పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి**
**: సీపీఐ**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**



కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను అడ్డగోలుగా పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని సీపీఐ నగర కార్యదర్శి కె. కనకరాజ్ ఆరోపించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజలతో పాటు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇంధన ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ ఆ ప్రయోజనాన్ని ప్రజలకు అందించకుండా కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికే గ్యాస్ కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై పెట్రోల్, డీజిల్ ధరల రూపంలో మరో భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించి పాత ధరలను పునరుద్ధరించాలని, పేద ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కోట కుమార్‌కు యూత్ ఐకాన్ అవార్డు

**జూన్ 15న ప్రముఖుల చేతుల మీదుగా ప్రదానం**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

అక్షర గోల్డ్ కేకే క్యాపిటల్స్ చైర్మన్ కోట కుమార్‌కు యూత్ ఐకాన్ అవార్డు ప్రకటించినట్లు స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో వ్యవస్థాపకుడు, చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ తెలిపారు. జూన్ 15న ప్రముఖుల చేతుల మీదుగా నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కోట కుమార్ విద్యా, సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. అక్షర స్కూల్స్‌ను స్థాపించి పేద విద్యార్థులకు ఉచితంగా, తక్కువ ఫీజులతో విద్య అందించడమే కాకుండా, ఇతర విద్యాసంస్థల్లో ఇంటర్, డిగ్రీ చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, పుస్తకాలు అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. అలాగే చలివేంద్రాల ఏర్పాటు, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, సాంస్కృతిక, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించడం, పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు తోడ్పాటు అందించడం, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు సహాయం చేయడం వంటి సేవా కార్యక్రమాల్లో కోట కుమార్ చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. సేవా తత్వంతో సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ అనేక కుటుంబాల్లో సంతోషం నింపుతున్నందుకు గాను ఆయనను యూత్ ఐకాన్ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## ధాన్యం తరలింపు, అన్ లోడింగ్ వేగవంతం చేయాలి

**రాజన్న సిరిసిల్ల :** కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించిన ధాన్యం మిల్లులకు తరలించడం, మిల్లుల్లో ఉన్న వాహనాలు అన్ లోడింగ్ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. శుక్రవారం ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి గ్రామంలోని రాజరాజేశ్వర రైస్ మిల్, రహీంఖాన్ పేట గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం, పొత్తూరు, బోయినిపల్లి మండలం మాన్వాడ, కొదురుపాక,

# ప్రభుత్వ జూనియర్ కళాశాల కమాన్పూర్‌లో లైబ్రరీ డే ఉత్సవాలు

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల కమాన్పూర్‌లో ఇంటర్ విద్య ప్రగతి ప్రణాళిక వారోత్సవాల్లో భాగంగా లైబ్రరీ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్ మాట్లాడుతూ కళాశాల లైబ్రరీలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, సూచిక గ్రంథాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. పుస్తకాలు విజ్ఞానానికి ద్వారాలని, లైబ్రరీ విద్యార్థుల మేధో వికాసానికి కేంద్రబిందువుగా నిలుస్తుందని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రాఘవపూర్ సర్పంచ్ టి. చామంతి మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో కూడా పుస్తక పఠనానికి ఉన్న ప్రాముఖ్యత తగ్గలేదని తెలిపారు. మంచి పుస్తకాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని, విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు జీవిత చరిత్రలు, విజ్ఞాన సర్వస్వాలు, పోటీ పరీక్షల పుస్తకాలు కూడా చదవాలని సూచించారు. విశ్రాంత డిగ్రీ కళాశాల అధ్యాపకులు డి. యాదగిరి మాట్లాడుతూ లైబ్రరీ ఒక జ్ఞాన నిలయమని పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా ఆలోచనా శక్తి, భాషా పటిమ, సృజనాత్మకత పెరుగుతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాల చైర్‌పర్సన్ శ్రీమతి నందిని శిరీష



కార్యక్రమానికి హాజరై కళాశాల అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన విద్యా వాతావరణం కల్పన, మరియు కళాశాల పురోగతికి అవసరమైన అన్ని విధాల సహాయం చేయడానికి కట్టుబడి ఉన్నామని ఆమె పేర్కొన్నారు. కళాశాల మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ అధ్యాపకులు, విద్యార్థులను ప్రోత్సహించారు. కళాశాల లైబ్రేరియన్ కె. నగేష్ మాట్లాడుతూ కళాశాల లైబ్రరీలో ఇంటర్ పాఠ్యపుస్తకాలతో పాటు ఋజూషెవ్, నీట్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు లైబ్రరీని ఎక్కువగా ఉపయోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఐతీ.జీ.రమేష్ దీ.బీమయ్య, వసీం, సంజీవ్, బాబు రావు,మధుసూదన్, చిరంజీవి, శశికళ, వినోద, కృష్ణ మోహన్ రావు, లక్ష్మి, లత, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108 వాహనం ఏర్పాటు చేయాలి



**మౌలిక సదుపాయాల కల్పనపై డీవైఎఫ్ఐ డిమాండ్**

**అగ్నిధార న్యూస్,(వాజేడు):**


ములుగు జిల్లా వాజేడు మండలంలోని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర వైద్య సేవల కోసం 108 అంబులెన్స్ వాహనాన్ని ఏర్పాటు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి బలుసుపాటి నరేష్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతమైన పేరూరులో సరైన వైద్య సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సమయానికి అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతమైన పేరూరులో ఎక్కువగా నిరుపేద కుటుంబాలే నివసిస్తున్నందున, అత్యవసర వైద్య సేవలతో పాటు మృతి చెందిన వారి మృతదేహాలను ఇంటికి తరలించేందుకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి నివాస భవనాలు నిర్మిస్తే 24 గంటలపాటు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముతేబోయిన మహేందర్, గౌరారపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత కనిష్టానికి పడిపోయిన రూపాయి.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్



భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. రూపాయి విలువ అత్యంత కనిష్టానికి పతనమవడం, క్రూడాయిల్ ధరలు పెరగడం మార్కెట్లపై దుష్ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 160.73 పాయింట్లు (0.21 శాతం) నష్టపోయి 75,237.99 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 46.10 పాయింట్లు (0.19 శాతం) నష్టపోయి 23,643.50 వద్ద ముగిసింది. రూపాయి విలువ తగ్గడం, చమురు ధరలు పెరుగుదల, ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం వంటివి ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగడం, హార్ముజ్ జలసంధి పూర్తి స్థాయిలో తెరుచుకోకపోవడం వంటివి కూడా ఇందుకు కారణాలు. ఈ కారణాలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 109 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు భారతీయ రూపాయి అత్యంత కనిష్ట స్థాయికి చేరింది. డాలర్‌తో రూపాయి విలువ 96.05 వద్ద ట్రేడవుతోంది. అంతకుముందు ఇది 95.9575 వద్ద కొనసాగింది. రూపాయి అత్యంత తక్కువ స్థాయికి చేరుకోవడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. రూపాయి ఇంత తక్కువ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. ఈ రోజు 0.3 శాతం తగ్గింది. చమురు ధరల పెరుగుదల, విదేశీ ద్రవ్యం అధికం కావడం, పశ్చిమాసియాలో అస్థిరత వంటివి రూపాయి పతనానికి కారణాలు. ఇండియా చమురు దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. అలాగే, అమెరికా వడ్డీ రేట్లు, మారక నిల్వలు తగ్గడం కూడా కారణాలుగా చెప్పుకోవచ్చు.

## మేక్‌మైట్రిప్ కొత్త అప్డేట్.. వాయిస్‌తోనే బుకింగ్!




భారతదేశంలోని ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ సంస్థ మేక్‌మైట్రిప్ తన ఏఐ బేస్డ్ ట్రావెల్ అసిస్టెంట్ 'మైరా'లో కొత్త అప్‌గ్రేడ్‌ను ప్రవేశపెట్టింది. ఈ అప్‌డేట్ ముఖ్య ఉద్దేశ్యం.. వినియోగదారుల బుకింగ్ ప్రక్రియను పూర్తిగా సులభతరం చేసి, సెర్చింగ్ నుంచి చెల్లింపు వరకు మొత్తం ఒకే ఇంటర్‌ఫేస్‌లో పూర్తి చేయగలిగేలా చేయడం. అవసరమైతే వాయిస్ ఆధారిత విధానంలో కూడా ఈ సేవలను ఉపయోగించుకోవచ్చు. 'మైరా 2.0' ఇప్పుడు సాధారణ సెర్చ్‌లను మాత్రమే కాకుండా, చాలా అవసరాలకు ఉపయోగపడుతుంది. క్లిష్టమైన ప్రయాణ అభ్యర్థనలను కూడా అర్థం చేసుకుని పరిష్కారం చూపుతుంది. ఉదాహరణకు.. కుటుంబ ప్రయాణాల కోసం ప్రత్యేక అవసరాలు ఉన్న హోటల్స్, వృద్ధుల కోసం సౌకర్యాలు లేదా వీసా సంబంధిత సమాచారం వంటి అంశాలను ఒకే చోట అందిస్తుంది. దీంతో వినియోగదారులు అనేక వెబ్‌సైట్లను పరిశీలించాల్సిన అవసరం లేకుండా, ఒకే వేదికపై పూర్తి సమాచారం పొందగలుగుతారు. ఈ కొత్త వెర్షన్‌లో.. వాయిస్ సపోర్ట్ కూడా ఉంది. తెలుగు సహా ఎనిమిది భాషల్లో.. వాయిస్ ద్వారా సెర్చ్, ఎంపికలు, బుకింగ్ వంటివి పూర్తి చేయవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వాయిస్ వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల, ఈ ఫీచర్ మరింత ఉపయోగకరంగా ఉంటుంది. అంతే కాకుండా.. వినియోగదారులు తమ పాస్‌పోర్ట్ లేదా ఇతర డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేస్తే, వాటి వివరాలను ఆటోమేటిక్‌గా గుర్తించి బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. మరో ముఖ్యమైన డెవలప్మెంట్ ఏమిటంటే.. చెల్లింపు ప్రక్రియను కూడా సంభాషణలోనే పూర్తి చేయగలగడం. వినియోగదారులు సెర్చ్ చేయడం, ఎంపిక చేయడం, కన్ఫర్మ్ చేయడం,పేమెంట్ చేయడం వరకు అన్ని దశలను ఒకే ఇంటర్‌ఫేస్‌లో పూర్తి చేయవచ్చు. అదేవిధంగా, బుకింగ్ మధ్యలో కూడా వినియోగదారులు ప్రశ్నలు అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు, దీంతో ప్రక్రియ మధ్యలో ఆగిపోకుండా కొనసాగుతుంది.

## ఎస్ఐను మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కురుమూర్తి నీ వెంకటాపూర్ గ్రామ ఉప సర్పంచ్, నశీబు ఇస్తారి,కాంగ్రెస్ పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి ,సంతోష్, ఐలెన్

స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు ఎస్ఐ కురుమూర్తి నీ శాలువాతో ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## జూలపల్లిలో గ్రామ సభ..



**అగ్నిధారన్యూస్ కమాన్ పూర్**

కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి గుమ్మడి సదయ్య, ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ పోలుదాసరి వనిత సాయికుమార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో పలు విషయాలపై చర్చించారు. ఈ గ్రామ సభలో వార్డు సభ్యులు చొప్పరి లక్ష్మి, చిట్యాల రాయమల్లు, ఉద్ధమారి పద్మ, ఇరుగురాల రమేష్, సాగర్ల రమ, సాగర్ల సౌజన్య, బొల్లంపల్లి సంతోష్ కుమార్, సోప్పరి సంతోష్ కుమార్, బండి శంకర్, పులి ప్రవళిక, మాజీ ఉపసర్పంచ్ వి డి సి చైర్మన్ పొలుదాసరి సాయికుమార్, ఏఎన్ఎం, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు వివో ఏలు ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది కారోబార్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాపం అర్జున్ టెండూల్కర్.. జట్టు మారినా?

ఐపీఎల్-2026లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున అరంగేట్రం కోసం ఎదురు చూస్తున్న సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. లక్నో ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో శుక్రవారం ఏకానా స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో అర్జున్ అవకాశం? దక్కుతుందని అంతా భావించారు. కానీ లక్నో మేనెజెమెంట్ మరోసారి అతడిని బెంచ్‌కే పరిమితం చేసింది. ఆకాష్ మహారాజ్ సింగ్, యయాంక్ యాదవ్ వంటి యువ పేసర్లను ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకొచ్చిన లక్నో.. అర్జున్‌ను మాత్రం పరిగణలోకి తీసుకోలేదు. గత సీజన్ వరకు ముంబై ఇండియన్స్‌లో ఉన్న అర్జున్.. ఐపీఎల్ 2026 కోసం జరిగిన ట్రేడింగ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వచ్చాడు. కానీ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లో ఆడే అవకాశం దక్కలేదు. సీజన్ తుది దశకు చేరుకున్నప్పటికి అర్జున్‌కు అవకాశమివ్వకపోవడాన్ని నెటిజన్లు తప్పుపడుతున్నారు. ఈ ఏడాది సీజన్‌లో లక్నోకు ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి.

## ఘనంగా బోరు కృష్ణయ్య టీచర్ జన్మదిన వేడుకలు



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:**

ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బోరు కృష్ణయ్య టీచర్ పుట్టినరోజు సందర్భంగా జన్మదిన వేడుకలు శుక్రవారం నాడు దేశయపల్లి గేట్లో జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శాలువాలతో సన్మానం చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో ఎక్కడ అన్యాయం జరుగుతుందంటే అక్కడ ఎదురు నిలబడి న్యాయం వైపు ఉండి పోరాడగలిగే వ్యక్తి బోరు కృష్ణయ్య టీచర్ అని కొని ఆడారు. ఈ కార్యక్రమంలో ఆశన్న, మూస నరసింహ,ఉపాధ్యాయులు రమేష్,వివేకానంద, వెంకటయ్య, వెంకట్ రాములు రాము రావణ్ ధర్మ, బాబు, శ్రీను,ఆయా గ్రామాల బహుజన సంఘాల నాయకులు ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు

## గుమ్మునూర్ అంగన్‌వాడీలో చిన్నారులకు ప్రేరణ



**సృజనాత్మకత, క్రమశిక్షణ పెంపొందించుకోవాలని సూచన**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

మంథని మండలంలోని గుమ్మునూర్ రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ చిన్నారులకు ప్రేరణ కలిగించే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ కళావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెరుకుతోట సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులతో ముచ్చటిస్తూ, చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవరుచుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. విద్యతో పాటు ఆటపాటలు, సృజనాత్మక కార్యక్రమాల్లో కూడా పిల్లలు చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందిస్తున్న ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవల ప్రాధాన్యతను వివరించారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారి భవిష్యత్తు నిర్మాణానికి తోడ్పడాలని కోరారు.

కార్యక్రమంలో చిన్నారులు పాటలు, ఆటల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు.

## రఘుపతి పేట లో వ్యక్తి ఆత్మహత్య

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామంలో కోటగిరి చంద్రయ్య(39) అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ కలహాల వల్లే కోటగిరి చంద్రయ్య ఆత్మహత్యకు కారణం అని అనుమానం, ఈ సందర్భంగా ఎస్ఐ కురుమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ కురుమూర్తి తెలిపారు.

# మహాకాళిలో రోహిత్ సరాఫ్



బుల్లితెర ధారావాహికలతో పాటు పలు విజయవంతమైన చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఉత్తరాది యువతలో క్రేజ్ సంపాదించుకున్నారు రోహిత్ సరాఫ్. తాజాగా ఆయన డివోషనల్ ఫాంటసీ థ్రిల్లర్ 'మహాకాళి'లో కీలక పాత్ర పోషిస్తున్నారు. పూజా కొల్లూరు దర్శకత్వంలో 'హను-మాన్'ఫేం ప్రశాంత్‌వర్మ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ నిర్మాణ దశలోనే ఆసక్తిని రేకెత్తిస్తున్నది. అక్షయ్‌ఖన్నా, భూమిశెట్టి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా భారతీయ ఆధ్యాత్మిక, పౌరాణిక మూలాలతో ముడిపడిన కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ఇందులో రోహిత్ సరాఫ్ పాల్గొంటున్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల ఆయన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ తన సోషల్‌మీడియా ఖాతాలో ఓ పోస్టర్‌ను పంచుకున్నారు.

# రామ్ బుజ్జి మైదానంలో అడుగుపెడితే!



అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ నటిస్తున్న పానిండియా రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. పానిండియా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచే విజువల్ వండర్‌గా దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వెంకట సతీశ్ కిలారు నిర్మాత. ఈ నెల 18న ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని ముంబయిలో ఘనంగా విడుదల చేయనున్నారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది.వీశీజఅవం ఈ నేపథ్యంలో ఇందులో 'మీర్జాపూర్'ఫేం దివ్యేందుశర్మ పోషిస్తున్న 'రామ్ బుజ్జి' పాత్రను పరిచయం చేస్తూ ఓ వీడియోను శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. క్రికెట్ మైదానంలో రామ్‌బుజ్జి ఎంట్రీ ఇచ్చిన తీరు, అతని బాడీ లాంగ్వేజ్, రగ్గ్‌డ్ యాటిట్యూడ్.. ఇవన్నీ పాత్రలోని ఇంటెన్సిటీని, కథలోని ప్రాముఖ్యతను ఆవిష్కరిస్తున్నాయి. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, సంగీతం: ఏఆర్ రెహమాన్, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్.



# గంగానదిలో అండర్ వాటర్ సీక్వెన్స్?

అగ్ర హీరో మహేశ్‌బాబు, దిగ్దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ యాక్షన్ అడ్వెంచర్ 'వారణాసి' చిత్రం దేశంలో రూపొందుతున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీస్‌లో మొదటి స్థానంలో ఉంటుంది. ప్రస్తుతం ఈ సినిమాలోని భారీ అండర్ వాటర్ యాక్షన్ సీక్వెన్స్‌ని కాశీలో చిత్రీకరిస్తున్నారు దర్శకుడు రాజమౌళి. నిజానికి ఈ సన్నివేశాలను హైదరాబాద్‌లోనే షూట్ చేయాలనుకున్నారాయన. గగన్‌పహాడ్ పరిసరాల్లో ఇందుకోసం ఓ భారీ కొలను కూడా నిర్మించారు. దీనికోసం దాదాపు 150 ట్యాంకర్ల నీళ్లు అవసరం కావడంతో జలమండలికి నిర్మాతలు లేఖ రాశారు. వేసవి కావడం చేత అంత నీరు ఇవ్వలేమంటూ ప్రభుత్వం 'వారణాసి' యూనిట్‌కి షాకిచ్చింది. దాంతో షూటింగ్‌ని కాశీకి షిఫ్ట్ చేశారు రాజమౌళి. అక్కడి గంగానదిలోనే అండర్ వాటర్ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ సీక్వెన్స్ సినిమా హైలైట్స్‌లో ఒకటిగా నిలుస్తుందని సమాచారం.వీశీజఅవం ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్ర పోషిస్తున్న విషయం విదితమే. ఈ చిత్రానికి కథ: వి.విజయేంద్రప్రసాద్, ఎస్ఎస్ కాంచి, మాటలు: దేవ కట్టా, కెమెరా: పీఎస్ విందా, సంగీతం: ఎంఎం కీరవాణి, నిర్మాతలు: కేవీల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ, నిర్మాణం: శ్రీదుర్గా ఆర్ట్స్.



# 'పెద్ది' ప్రమోషన్లకు జాన్వీ దూరం .. ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన ప్రచారం!

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ లెజెండరీ నటి శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలోకి అడుగుపెట్టి మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, ఇప్పటివరకు భారీ కమర్షియల్ విజయాన్ని మాత్రం అందుకోలేకపోయింది. బాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించిన జాన్వీ, ఇప్పుడు తన ఫోకస్‌ను తెలుగు సినిమాలపై ఎక్కువగా కేంద్రీకరిస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పెద్ది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ గ్రామీణ యువతిగా కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్‌లలో ఆమె లుక్‌కు మంచి స్పందన లభించింది. అయితే ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన మరో వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఓ ప్రముఖ దినపత్రిక ప్రచురించిన కథనం ప్రకారం, జాన్వీ కపూర్ 'పెద్ది' ప్రమోషన్లకు పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకుందనే ప్రచారం జరుగుతోంది. భారీ రెమ్యూనరేషన్ కారణంగానే ఆమె ఈ ప్రాజెక్ట్‌కు అంగీకరించిందని, సినిమాలో తన పాత్రకు అంత ప్రాధాన్యత లేదనే భావనతో ప్రమోషన్లలో పాల్గొనాలనే ఆసక్తి చూపడం లేదని ఆ కథనం పేర్కొంది. అయితే ఈ వార్తలపై చిత్ర యూనిట్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ ఈ ప్రచారం నిజమైతే, అది జాన్వీ కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే 'పెద్ది' వంటి భారీ పాన్ ఇండియా చిత్రంతో ఆమెకు దక్షిణాదిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా మరింత గుర్తింపు దక్కే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుల్లో బలమైన మార్కెట్‌ను సంపాదించుకోవడానికి ఈ సినిమా కీలకంగా మారనుంది. ప్రస్తుతం జాన్వీ చేతిలో పెద్దగా హై-ప్రొఫైల్ ప్రాజెక్టులు లేని నేపథ్యంలో, 'పెద్ది' విజయం ఆమెకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలను తెచ్చిపెట్టే అవకాశముంది. అందుకే ఈ సినిమా ప్రమోషన్లలో చురుకుగా పాల్గొనడం ఆమె కెరీర్‌కు ప్లస్ అవుతుందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా రిలీజ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ హైప్ మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జాన్వీ చివరకు ప్రమోషన్లలో పాల్గొంటుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com